
50 టీఎంసీల చేరువలో సోమశిల



జిల్లా జలప్రసాదిని సోమశిల జలాశయంలో నీటినిల్వ 50 టీఎంసీలకు చేరువైంది. ఎగువ నుంచి శనివారం 14,017 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 49.432 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 50, కండలేరుకు 10వేలు ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు చొప్పున నీటిని సరఫరా చేస్తున్నారు.

- అనంతసాగరం



మన నిమ్మ నేపాల్‌కు..

పొదలకూరు నిమ్మ మార్కెట్ యార్డు నుంచి నేపాల్ దేశానికి నిమ్మకాయలు ఎగుమతి అవుతున్నాయి. రెండు నెలలుగా నేపాల్‌కు నిమ్మకాయ లు పంపుతున్నట్లు వ్యాపారులు పేర్కొన్నారు. లారీల ద్వారా ఈ నిమ్మకాయలు పాట్నాకు, అక్కడ నుంచి నేపాల్ దేశస్థులు వివిధ వాహనాల్లో తీసుకెళతారని వారు తెలిపారు. గోతాల్లో ప్యాక్ చేసి లారీల్లో పంపితే బస్తాల ఒత్తిడికి కింద భాగంలోని నిమ్మ కాయలు దెబ్బతింటాయని, అందువల్ల ట్రేలల్లో ప్యాకింగ్ చేసి పంపుతున్నట్లు తెలిపారు.

- పొదలకూరు

బీఎస్ఎన్ఎల్‌లో 'సర్వత్రా వైఫై'

- విని యోగదారులకు సరికొత్త ఆఫర్

నెల్లూరు (సాంస్కృతికం) : ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ వినియోగదారుల కోసం ఉచిత వైఫై రోమింగ్ సేవలు ప్రారంభించిందని ఆ సంస్థ డీజీఎం శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. దీనిని సర్వత్రా వైఫై సేవలుగా నామకరణం చేశామన్నారు. ఈ వినూత్న సేవ ద్వారా బీఎస్ఎన్ఎల్, ఎఫ్‌టీటీహెచ్ వినియోగదారుల కనెక్టివిటీ సేవలు మెరుగు పరుస్తాయని తెలిపారు. ఉచిత వైఫై రోమింగ్ సేవను బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు https://portall.bsnl.in/ftth/wifiroming ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు.వినియోగదారుల సొంత ఖాతాలోనే బిల్లింగ్ జరుగుతుందని, అదనపు భారం ఉండదని తెలిపారు. రోమింగ్‌లో ఒక్కో ఎఫ్‌టీటీహెచ్ ఖాతాకు 4 పరికరాలు ఏకకాలంలో ఇంటర్నెట్ సేవలు పొందవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

- ఈ నెలాఖరుకు 4జీ సేవలు

జిల్లావ్యాప్తంగా ఈ నెలాఖరు నాటికి 4జీ సేవలు పూర్తిస్థాయిలో అందించేందుకు కృషి చేస్తున్నట్లు డీజీఎం పేర్కొన్నారు. జిల్లాలో 323 బీఎస్ఎన్ఎల్ టవర్లు ఉండగా దాదాపు 90 టవర్లు 4జీ సేవలు అందిస్తున్నాయని తెలిపారు. బీఎస్ఎన్ఎల్‌కు ఉన్న 72 వేల మంది వినియోగదారుల్లో 44 వేల మంది 4జీ సేవల్లోకి మార్పు చేసుకున్నట్లు పేర్కొన్నారు. జియో, ఎయిర్‌టెల్ ఇతర సంస్థల నుంచి బీఎస్ఎన్ఎల్‌కు మారే వారి సంఖ్య, కొత్త కనెక్షన్లతో కలిపి 2.4 లక్షల మంది బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు ఉన్నారని ఆయన తెలిపారు. ఫైబర్ టూ హోమ్ ఇంటర్నెట్ కనెక్షన్లు జిల్లావ్యాప్తంగా 17 వేల వరకు ఉన్నాయని తెలిపారు.



పేదల బియ్యానికి పురుగులు

ఉదయగిరి పౌరసరఫరాల శాఖ గోదాములో పేదలకు పంపిణీ చేసే బియ్యం సుమారు ఆరు టన్నుల వరకు పురుగులు పట్టి ఎందుకూ పనికిరాకుండాపోయాయి. కావలి మార్గంలో ఉన్న ప్రభుత్వ సివిల్ సప్లయ్ గోదాముల శిథిలావస్థకు చేరడంతో మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో ఉన్న గోదాముల్లో కార్యకలాపాలు సాగిస్తున్నారు. అయితే ఇటీవల సీతారామపురం- దుత్తలూరు మధ్య 167-బీజీ జాతీయ రహదారి నిర్మిస్తున్నారు. అయితే, రహదారి వెంబడే గోదాములు ఉండటంతో వాటిని తొలగించే చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గోదాములో ఉన్న సుమారు ఆరు టన్నుల బియ్యం పురుగులు పట్టి పాడై ఉండటాన్ని గుర్తించి, మరోచోటకు తరలించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే రూ.లక్షల విలువైన పేదల బియ్య పాడయ్యాయని పలువురు ఆరోపిస్తున్నారు.

- ఉదయగిరి రూరల్

17 నుంచి ఎస్‌జీఎఫ్

క్రీడా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 14 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 17వతేదీ నుంచి నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో అండర్-19 విభాగంలో వివిధ క్రీడాంశాల్లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ కార్యదర్శి డి.శ్రీరేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 17న బ్యాడ్మింటన్, ఫెన్సింగ్, మాల్కమ్ క్రీడాపోటీలు నిర్వహించి జట్లను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడా కారులు ఆరు నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు చదువుతూ 2006 జనవరి 1వ తేదీ తరువాత జన్మించి ఉండాలని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకా రులు సంబంధిత హెచ్‌ఎం నుంచి ధ్రువీ కరణ పత్రం, ఇంటర్ విద్యార్థులు టెన్త్ ఒరిజినల్ మార్క్ లిస్ట్ తీసుకుని సంబంధిత తేదీల్లో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు. అలాగే 18న ఫుట్‌బా ల్, జూడో, టేబుల్‌టెన్నిస్, సైక్లింగ్ రోడ్, సైక్లింగ్ ట్రాక్, బాక్సింగ్, జిమ్నాస్టిక్స్ ఎంపికలు, 19న ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ ఎంపికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9704827095ను సంప్రదించాలని తెలిపారు.



తీరప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచాం!

- మెరైన్ డీఎస్పీ బాలరాజు

అల్లూరు, సెప్టెంబరు 14: తీరప్రాంతాల్లోని సముద్రమార్గం గుండా సంఘవిద్రోహ శక్తులు చొరబాటుకు అవకాశం లేకుండా ప్రత్యేక నిఘా ఉంచా మని విశాఖపట్నం మెరైన్ సౌత్‌జోన్ డీఎస్పీ కె.బాలరాజు తెలిపారు. ఇస్కపల్లి తీరప్రాంతంలోని మెరైన్ పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. స్మగ్లర్లు, చొరబాటుదారులకు అవకాశం లేకుండా నిరంతరం గస్తీ ఉంటుందన్నారు. అనంతరం స్థానిక మత్స్యకారులతో మాట్లాడారు. తీరప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తున్నా.. అనుమానాస్పదంగా ఎవరైనా తారసపడినా, అదేవిధంగా కొత్తతరహా బోట్లు, వస్తువులు సముద్రంలో నుంచి కొట్టుకొచ్చినట్టు తెలిసినా స్థానిక మెరైన్ పోలీసు సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. దేశ రక్షణలో తీరప్రాంతవాసులదే కీలకపాత్ర అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాయబ్ రసూల్, సిబ్బంది కృష్ణ, మల్లికార్జున, సురేష్, వినోద్, ఏడుకొండలు, వేణు తదితరులు పాల్గొన్నారు.

జాడలేని ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- అన్నదాతల గగ్గోలు

- వివరాలు 7లో..

'దేశం'లోకి చలో చలో!

నగరాలు, మున్సిపాలిటీల్లో అభివృద్ధికి ఆటంకాలు కలగకుండా తెలుగుదేశం పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. స్థానిక సంస్థల్లో బలం పెంచుకునే దిశగా పావులు కదుపుతోంది. టీడీపీ తలుపులు తెరుచుకోకముందే స్థానిక సంస్థల వైసీపీ ప్రజాప్రతినిధులు టీడీపీ ఎమ్మెల్యేల ఇళ్ల ముందు బారులు తీరారు. ఈ క్రమంలో పాలకమండళ్లు ఉన్న నెల్లూరు కార్పొరేషన్, ఆత్మకూరు మున్సిపాలిటీతోపాటు బుచ్చి నగర పంచాయతీలో వైసీపీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు సైకిల్ ఎక్కేందుకు సన్నద్ధం అవుతున్నారు.


- స్థానిక సంస్థల్లో బలం పెంచుకునే దిశగా టీడీపీ అడుగులు
- అభివృద్ధికి ఆటంకం కలగకూడదనే ఉద్దేశం
- మూకుమ్మడిగా టీడీపీలో చేరేందుకు వైసీపీ ప్రజాప్రతినిధుల సన్నద్ధం
- నెల్లూరులో కార్పొరేటర్లంతా జంప్?
- మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిలతో నిత్యం టచ్‌లో..
- ఆత్మకూరు, బుచ్చిలోనూ ఇదే పరిస్థితి

నెల్లూరు (ఆంధ్రజ్యోతి), సెప్టెంబరు 14 : వైసీపీ పాలనలో స్థానిక సంస్థల ఎన్నికలు ఎలా జరిగాయో ప్రజలకు తెలిసిందే. దౌర్జన్యాలు, బెదిరింపులతో 54 డివిజన్లు ఉన్న నెల్లూరు కార్పొరేషన్‌ను ఏకపక్షం చేసుకున్నారు. ఒక్కటంటే ఒక్కటి కూడా టీడీపీకి దక్కకుండా సర్వశక్తులు ఉపయోగించారు. ఆత్మకూరు, బుచ్చిలలోనూ ఇదే జరిగింది. దీంతో పట్టణ పాలక మండళ్లలో టీడీపీ ప్రాతినిధ్యం నామమాత్రం అయ్యింది. అయితే, అభివృద్ధి నినాదంతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పట్టణాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టింది. అయితే కార్పొరేషన్, మున్సిపాలిటీల పాలక మండళ్లలో సభ్యులంతా వైసీపీకి చెందిన వారే ఉండటం అభివృద్ధికి ఆటంకంగా భావించింది. ఈ క్రమంలో మున్సిపాలిటీ పాలకమండళ్లలో బలం పెంచుకోవడం కోసం వైసీపీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లను టీడీపీలో కలుపుకోవాలని అధిష్ఠానం నిర్ణయించుకుంది. ఊహించని ఈ అవకాశాన్ని వైసీపీ నాయకులు వదులుకోదలుచుకోలేదు. టీడీపీ ఎమ్మెల్యేలు పిలవకముందే వారి ఇళ్ల ముందు బారులు తీరడం మొదలు పెట్టారు. వారంతట వారుగా వచ్చి పార్టీలో చేరుతామని అనడంతో టీడీపీ నాయకులు కూడా కాదనలేకపోతున్నారు.

- నెల్లూరు సిటీ, రూరల్ నియోజక వర్గాల్లో విస్తరించి ఉన్న నెల్లూరు నగరం 54 డివిజన్లు ఉన్నాయి. వీటిలో రూరల్ పరిధిలో 26 డివిజన్లు ఉండగా సుమారు 10 మంది కార్పొరేటర్లు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వెంట ఉన్నారు. మిగిలిన 16 మందిలో ఇప్పటికి 10 మంది వైసీపీ కార్పొరేటర్లు ఎమ్మెల్యేను కలిసి టీడీపీలో చేరడానికి సిద్ధం అనే సంకేతాలు ఇచ్చారు. ఇక మేయర్ పొట్లూరి స్రవంతితోపాటు ఆరుగురు మిగిలారు. వీరిలో నలుగురు కార్పొరేటర్లను చేర్చుకునే విషయంలో అనుమానాలు ఉన్నాయి. మిగిలిన ఇద్దరికి కూడా ఎమ్మెల్యే నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చే అవకాశాలు ఉన్నట్టు సమాచారం.
- ఇక సిటీ నియోజకవర్గ పరిధిలో 28 మంది కార్పొరేటర్లు ఉండగా, వీరిలో ఒకరిద్దరు మినహా మిగిలిన 26 మంది మంత్రి నారాయణ వెంట నడవడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం. నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి పలువురు కార్పొరేటర్లతో చర్చలు జరుపుతున్నారు. అయితే సిటీ పరిధిలో కూడా ఐదారుగురు కార్పొరేటర్లను చేర్చుకోవడానికి టీడీపీ క్యాడర్ అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. విజయవాడలో పరిస్థితి చక్కబడిన తరువాత నగరంలోని వైసీపీ కార్పొరేటర్లు పెద్ద సంఖ్యలో టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. ప్రస్తుతం నగర పాలక సంస్థలో సున్నా బలం ఉన్న తెలుగుదేశం నెల వ్యవధిలో 40 నుంచి 45 మంది సభ్యుల బలం కలిగిన పార్టీగా గుర్తింపు పొందనుంది.
- ఆత్మకూరు మున్సిపాలిటీలో కూడా ఇదే పరిస్థితి. 23 మంది కౌన్సిలర్లు ఉన్న ఈ మున్సిపాలిటీలో వైసీపీకి 20, టీడీపీ 2, స్వతంత్ర అభ్యర్థి ఒకరు ఉన్నారు. వీరిలో ఇప్పటికే ఇద్దరు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. మిగిలినవారిలో అత్యధికులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నట్లు సమాచారం. మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ఒక్కటే ఇక్కడ మిగిలింది.
- బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో వైసీపీకి 18 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఇక్కడ టీడీపీ బలం కేవలం 2 వార్డులే. టీడీపీలో చేర్చుకోమంటూ పలువురు కౌన్సిలర్లు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని కోరుతున్నారు. ఇక్కడ కూడా ఇద్దరు, ముగ్గురు మినహా మిగిలిన వైసీపీ కౌన్సిలర్లు అందరూ మూకుమ్మడిగా టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది.

పాత వారిలో కలవరం

అభివృద్ధికి ఆటంకాలు ఎదురుకాకూడదనే ఉద్దేశంతో టీడీపీ అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎమ్మెల్యేలు, మంత్రులు చెబుతున్నా పార్టీలోని సీనియర్ నాయకులు మాత్రం ఈ నిర్ణయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. వార్డు, డివిజన్ ఇన్‌చార్జులుగా ఐదేళ్లపాటు పార్టీ కోసం కష్టపడి పనిచేసి, వైసీపీ దౌర్జన్యాలను, అక్రమ కేసులను భరించిన తమకు అధికారంలోకి వచ్చిన తరువాత అన్యాయం జరుగుతోందనే ఆవేదన వీరిలో వ్యక్తం అవుతోంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు వారే, టీడీపీ అధికారంలోకి వచ్చినప్పుడూ వారే అందలం ఎక్కితే, జీవితాంతం తమకు పల్లకీలు మోసే పని తప్ప వేరేది లేదా అనే ఆందోళన టీడీపీ ద్వితీయ శ్రేణినాయకుల్లో వ్యక్తం అవుతోంది. అభివృద్ధి కోణంలో వైసీపీ కార్పొరేటర్లను కలుపుకోక తప్పని పరిస్థితులు ఉన్నాయడంలో ఎంత వాస్తవం ఉందో, పాత కొత్తలను సమన్వయం చేసుకోలేపోతే రాజకీయం ముప్పు తప్పదన్న వాదనలోనూ అంతే బలం ఉంది. వార్డులు, డివిజన్లలో ఉన్న టీడీపీ నాయకుల గౌరవం కాపాడాల్సిన అవసరం ఎమ్మెల్యేలపై ఉంది. ఎందుకంటే పార్టీకి నిజమైన పునాదులు వీరు. ఇప్పుడు కొత్తగా పార్టీలోకి చేరే వైసీపీ నాయకులు రేపు ఎన్నికల వరకు ఉంటారో ఉండరో గ్యారెంటీ లేదు. వీరి చేరిక కారణంగా పట్టణాల్లో చేపట్టాలనుకున్న అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడకపోవచ్చు. కానీ రాజకీయ కోణంలో చూస్తే మాత్రం పార్టీని నమ్ముకొని శ్రమించిన పాత నాయకులను కాపాడుకోవటం అనివార్యం. పాత, కొత్త నాయకులను సమన్వయం చేసుకుని ముందుకెళ్లినప్పుడే ఎమ్మెల్యేలు రాజకీయంగా సక్సెస్ అవుతారు. లేని పక్షంలో పట్టణాల్లో అభివృద్ధి బాటలు వేయగలరేమో కాని రాజకీయంగా మాత్రం ఇబ్బందులు ఎదుర్కొనక తప్పదు.





నెల్లూరు : లోక్‌అదాలత్‌లో పాల్గొన్న జిల్లా న్యాయాధికారి యామిని తదితరులు

జాతీయ లోక్‌అదాలత్‌లో 24,972 కేసుల పరిష్కారం

నెల్లూరు (లీగల్), సెప్టెంబరు 14 : జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం జిల్లావ్యాప్తంగా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అదాలత్ విజయవంతమైంది. జిల్లావ్యాప్తంగా 24,972 కేసులు పరిష్కారమయ్యాయి. ఉదయం 10.30 గంటలకు నెల్లూరులో జిల్లా ప్రధాన న్యాయాధికారి సి.యామిని లోక్ అదాలత్‌ను ప్రారంభించి, ప్రసంగించారు. రాజీ అయ్యే అవకాశం ఉన్నప్పుడు రాజీ చేసుకోవడం ఇరు పార్టీలు సుహృద్భావ వాతావరణంలో ఉండవచ్చని అన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక బెంచీలు ఏర్పాటు చేసి కక్షిదారుల కేసులను పరిష్కరించారు. 3వ అదనపు జిల్లా న్యాయాధికారి యల్.తేజోవతి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి ఐ.కరుణ కుమార్, పినపాటి భరద్వాజ, యల్.శారదా రెడ్డి, యన్. లావణ్య, పాలమంగళం వినోద్, అథారిటీ కార్యదర్శి కె.వాణితోపాటు పలువురు ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. నెల్లూరులో 8,313 కేసులు, కోవూరు 4,259, కావలి 1,432, ఉదయగిరి 1,068, ఆత్మకూరు 2,130, గూడూరు 688, వెంకటగిరి 2,965, కోట 2,000, నాయుడుపేట 914, సూళ్లూరుపేట 1,203 కేసులు, ప్రిలిటిగేషన్ కేసులు 136, బీఎస్ఎన్ కేసులు 46 కేసులు పరిష్కరింపబడ్డాయి. ఈ సందర్భంగా వివిధ కేసులలో రూ. 10,25,67,039 పరిహారం కింద కక్షిదారులకు చెల్లించనున్నారు.

మహిళా ఖైదీల వసతులను పరిశీలిస్తున్నాం!

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మి



వెంకటాచలం, సెప్టెంబరు 14 : రాష్ట్రంలోని అన్ని జైళ్లల్లో మహిళా ఖైదీలకు కల్పిస్తున్న వసతులను ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నట్లు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి తెలిపారు. మండలంలోని చెముడుగుంట పంచాయతీ పరిధిలోని కేంద్ర కారాగారాన్ని శనివారం ఆమె పరిశీలించారు. మహిళా ఖైదీల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మహిళా ఖైదీలకు జైలులో కల్పిస్తున్న వసతి సౌకర్యాలను ఆమెకు అధికారులు వివరించారు. అనంతరం జైలు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జైళ్లల్లో తాము పరిశీలించిన అంశాలపై జాతీయ మహిళా కమిషన్‌కు నివేదికను అందజేస్తామన్నారు. నెల్లూరు కేంద్ర కారాగారంలో సౌకర్యాలన్నీ చాలా బాగున్నాయన్నారు. ఖైదీలంతా జైలులో పరివర్తన చెంది సమాజంలో సత్ప్రవర్తనతో జీవించాలని కోరారు. ఆమె వెంట జైలు అధికారులు తదితరులు ఉన్నారు.

పోలీసు కస్టడీకి మేయర్ భర్త

- 4 రోజులు విచారించనున్న పోలీసులు
- ఇంకెందరి పేర్లు వెలుగులోకి వస్తాయనే ఉత్కంఠ

నెల్లూరు (క్రైం) : నగర పాలక సంస్థలో కమిషనర్ల సంతకాల ఫోర్జరీ కేసులో నిందితుడిగా ఉన్న మేయర్ భర్త పి జయవర్ధన్‌ను శనివారం శనివారం తమ కస్టడీకి తీసుకున్నారు. ఈ నెల 10వ తేదీన నెల్లూరు ఐదో అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో జయవర్ధన్ లొంగిపోయారు. న్యాయాధికారి 14 రోజుల రిమాండ్ విధించడంతో ఆయన్ను కేంద్ర కారాగారానికి తరలించారు. అయితే, ఈ కేసులో పూర్తిస్థాయి విచారణ కోసం జయవర్ధన్‌ను తమ కస్టడీకి ఇవ్వాలని కోర్టుకు విన్నవించుకోగా నాలుగురోజుల పాటు కస్టడీకి అనుమతించింది. దీంతో శనివారం పోలీసులు జిల్లా కేంద్ర కారాగారం నుంచి ఆయన్ను తమ కస్టడీకి తీసుకొన్నారు. కాగా, జయవర్ధన్ పోలీసు కస్టడీకి వెళ్లడంతో విచారణలో ఎవరి పేర్లు వెలుగులోకి వస్తాయన్న ఉత్కంఠ అందరిలో ఉంది. నగర డీఎస్పీ డి శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ప్రత్యేక బృందం జయవర్ధన్‌ను ఈ నెల 17వ తేదీ వరకు విచారించనుంది.



జయవర్ధన్‌ను కస్టడీకి తీసుకుంటున్న పోలీసులు

ముఖ్యమంత్రి, ఎక్సైజ్ మంత్రి చిత్రపటాలకు పాలభిషేకం

నెల్లూరు, (స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 14: సెబ్‌ను ఎక్సైజ్‌లో విలీనం చేసినందుకు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రబాబుల చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా డిప్యూటీ కమిషనర్ కె.హేమంత నరసరాజు మట్లాడుతూ సెబ్‌ను ఎక్సైజ్‌లో విలీనం చేయడం మంచి పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పీ.దయాసాగర్, ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కే.నాగమల్లేశ్వరరెడ్డి, బీ.బాబు శ్రీధర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబు, మంత్రి కొల్లు చిత్రపటాలకు పాలభిషేకం చేస్తున్న అధికారులు

మాలకొండ ఆదాయం రూ.11,74,616



వలేటివారిపాలెం, సెప్టెంబరు 14: మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుండి రూ.11,74,616 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.బీ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అష్టోత్తరం టిక్కెట్, కుంకుమార్చన, వివాహముల ద్వారా, తలనీలాలు, వాహనపూజ, ప్రత్యేకదర్శనం, స్థలపురాణం పుస్తకాలు విక్రయం, రూముఅద్దెలు, కవర్లు అమ్మకం, లడ్డుప్రసాదం, అన్నదానం, విరాళముల ద్వారా ఈ ఆదాయం లభించినట్లు శ్రీనివాసరావు పేర్కొన్నారు.



ఈ దాహం తీరనిది..

స్థానిక మున్సిపల్‌ కార్యాలయ ఆవరణలోకి శనివారం వానరులు నీటి కోసం వచ్చాయి. అక్కడ తాగునీటి కొళాయి ఉండటంతో దాహం తీర్చుకుంటూ ఆంధ్రజ్యోతి కెమెరాకు చిక్కాయి. ఆ వానరులు నెట్టుకోకుండా ఒకదాని తర్వాత నీటిని తాగాయి. మున్సిపల్‌ కార్యాలయానికి వచ్చిన ప్రజలు వాటిని చూస్తూ ఉండిపోయారు.

- కావలి

వరద బాధితులకు చేయూత

- విద్యార్థులు భారీగా విరాళాల సేకరణ

విజయవాడ వరద బాధితుల కోసం దాతలతోపాటు విద్యార్థులు సైతం విరాళాలు సేకరిస్తున్నారు. ఏఎస్‌పేటలోని ఠాగూర్‌ పాఠశాల విద్యార్థులు రూ.1,36,610 సేకరించగా, ఆ స్కూలు యాజమాన్యం రూ.20వేలు, ఉపాధ్యాయులు రూ.10వేలు మొత్తం రూ.1,66,610లను ఎస్‌ఐ సైదులుకు అందించారు. కరస్పాండెంట్‌ రమణారెడ్డి, హెచ్‌ఎం దొర స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే అనంతసాగరంలోని శాంతినికేతన్‌ విద్యార్థులు రూ. 1,88,500 సేకరించి ఎంఈవో 2 ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా సీఎం సహాయనిధికి పంపారు. పాఠశాల నిర్వాహకులు ఉమా మహేశ్వరి, ప్రభా కర్‌, సిబ్బంది పాల్గొన్నారు. చేజర్లలోని లుంబినీ విద్యాలయం విద్యార్థులు రూ.88,020 సేకరించి కరస్పాండెంట్‌ బి రమేష్‌కు అందజేశారు. ఈ మొత్తాన్ని ఆత్మకూరు ప్రైవేటు స్కూల్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడికి అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

- ఏఎస్‌పేట/అనంతసాగరం/చేజర్ల



అనంతసాగరం : ఎంఈవోకు నగదు అందజేస్తున్న విద్యార్థులు



ఏఎస్‌పేట : ఎస్‌ఐ సైదులుకు విరాళం అందిస్తున్న విద్యార్థులు



22 చక్రాల ట్రాలీ ఎక్కిన భారీ పడవ

సూరాయపాళెం పెన్నా నదిలో డీసిల్టేషన్‌ ఇసుక తీసేందుకు విజయవాడ నుంచి భారీ పడవను సంగం మీదుగా ట్రాలీలో తీసుకెళ్లారు. జిల్లాలో డీసిల్టేషన్‌ ఇసుకను డ్రెడ్జింగ్‌ విధానంలో తీసేందుకు తీసుకువచ్చిన ఈ పడవ సామర్థ్యం 30 టన్నులు. ఈ పడవ 30 నిమిషాల్లో 30 టన్నుల ఇసుకను డ్రెడ్జింగ్‌ విధానంలో తీసి గట్టుకు చేర్చగలదు. సంగంలో ఉండే రెండు పడవల కంటే ఇది పెద్దది.

- సంగం

రూ.98 లక్షల రికవరీకి ఆదేశం



బహిరంగ విచారణ చేస్తున్న అధికారులు

కొండాపురం, సెప్టెంబరు 14: మండల కార్యాలయ ఆవరణలో ఉపాధిహామీ సామాజిక తనిఖీ బహిరంగ విచారణ శుక్రవారం ప్రారంభమై శనివారం వేకువజామున వరకు జరిగింది. గతేడాది మండలంలో రూ.16కోట్ల నిధులతో పనులు జరుగ్గా సామాజిక తనిఖీ అధికారులు దాదాపు రూ.6కోట్లు దుర్వినియోగం జరిగినట్లు నిర్ధారించారు. బహిరంగ విచారణలో 19 పంచాయతీలకు సంబంధించి రూ.98లక్షలను రికవరీకి ఆదేశించినట్లు డీపీవో చెంచయ్య తెలిపారు. ఈ తనిఖీల్లో సాయిపేట పంచాయతీ ఇస్కపాలెం, సత్యవోలు పంచాయతీలోని అగ్రహారం ఎస్సీ కాలనీలోనూ కూలీలకు పనులు కల్పించలేదన్నారు. చనిపోయిన వారి జాబ్‌ కార్డులపై నగదు చెల్లించినట్లు, భార్య భర్తలకు వేర్వేరుగా జాబ్‌కార్డు, వారానికి రూ.100 కూలీ నుండి సిబ్బంది వసూలు చేసినట్లు తనిఖీ సిబ్బంది గుర్తించారు. బహిరంగ విచారణకు గ్రామాల నుంచి వచ్చిన కూలీలు కూడా పలు సమస్యలను అధికారుల ముందు విన్నవించారు. గానుగపెంట, గుడవల్లూరు పంచాయతీలకు టీఏలు లేకపోవడంతో ఈసీనే ఇన్‌చార్జిగా నియమించడంతో రూ.లక్షలు అవకతవకలకు పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. సాయిపేట పంచాయతీలోనే రూ.60లక్షలకుపైగా రికవరీకి తనిఖీ సిబ్బంది గుర్తించగా అధికారులు రూ.22లక్షలు పైగా రికవరీకి ఆదేశించడం గమనార్హం.

రాపూరు వాసి బాలీలో మృతి

రాపూరు, సెప్టెంబరు 14: రాపూరు పట్టణవాసి బేతనబోయిన ప్రవీణ్‌ (30) ఇండోనేషియా దేశం బాలీ పట్టణంలో మృతిచెందాడు. ఈనెల 9వ తేదీన స్నేహితులతో సరదాగా ట్రిప్‌కి వెళ్లిన ప్రవీణ్‌ స్విమ్మింగ్‌ పూల్‌లో స్నేహితులతో ఈత కొడుతూ గుండెపోటుకి గురవ్వడంతో స్నేహితులు స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు శోకసంద్రంలో మునిగిపోయారు. ప్రవీణ్‌ మృతదేహం ఆదివారం ఉదయానికి స్వగ్రామం రాపూరు మండలం నవాబుపేట గ్రామానికి చేరుతుందని, మధ్యాహ్నం అంత్యక్రియలు జరుగుతాయని తెలిపారు.

దున్నపోతు పొడిచి మహిళ..

ఉదయగిరి రూరల్‌, సెప్టెంబరు 14: దున్నపోతు పొడిచి ఓ మహిళ మృతిచెందిన సంఘటన మండలంలోని తిరుమలాపురం పంచాయతీ గుడినరవ గ్రామంలో శనివారం వెలుగు చూసింది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మట్ల వెంగమ్మ (60) శుక్రవారం సాయంత్రం అటవీ ప్రాంతానికి మేతకెళ్లి వచ్చిన తన గేదెలను ఇంటి ఆరుబయట కట్టేందుకు వెళ్లింది. ఆ సమయంలో గేదెలతోపాటు వచ్చిన అడవి దున్నపోతు ఒక్కసారిగా వెంగమ్మ, సమీపంలో ఉన్న ఆటోడ్రైవర్‌ రవిపై దాడిచేసింది. ఈ దాడిలో రవి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. తీవ్రంగా గాయపడిన వెంగమ్మను చికిత్స నిమిత్తం ఉదయగిరి వైద్యశాలకు గ్రామస్థులు తరలించారు. వైద్యుల సూచన మేరకు అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లగా అక్కడి వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని, బతకడం కష్టమని చెప్పడంతో కుటుంబ సభ్యులు తిరిగి వెంగమ్మను స్వగ్రామానికి తీసుకొస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్‌ బియ్యం లారీ పట్టివేత

వెంకటాచలం, సెప్టెంబరు 14: వెంకటాచలం సమీపం లోని టోల్‌ప్లాజా వద్ద శనివారం వేకు వజామున విజిలెన్స్‌ రెవెన్యూ అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. నెల్లూరు వైపు నుంచి చెన్నైకి వెళ్తున్న లారీ(టీఎన్‌72 బీఎం5720)ని నిలిపి తనిఖీ చేయగా, 25 టన్నుల రేషన్‌ బియ్యంతో దొంగ బిల్లులు పెట్టుకొని ఉండటాన్ని గుర్తించారు. లారీని సీజ్‌ చేసి డ్రైవర్‌, క్లీనర్లను అదుపులోకి తీసుకున్నారు. సీజ్‌ చేసిన రేషన్‌ బియ్యం లారీని వెంకటాచలం పోలీస్‌ స్టేషన్‌కు అప్పగించారు.

దొనకొండ ప్రాంతంలో రాజధాని పేరుతో స్థలాల విక్రయం

- నెల్లూరులో పోలీసు కేసు నమోదు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 14: ప్రకాశం జిల్లా దొనకొండ ప్రాంతంలో రాజధాని రాబోతుందని, ఇప్పుడే స్థలాలు కొనుగోలు చేస్తే మంచి ఆదాయం ఉంటుందని మాయమాటలు చెప్పి మోసగించిన ఓ డెవలపర్స్‌ నిర్వాహకులపై నెల్లూరు దర్గామిట్ట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. దొనకొండ ప్రాంతంలో రాజధాని రాబోతుండడంతో తాము వెంచర్లు వేస్తున్నామని 2020వ సంవత్సరంలో నెల్లూరు నగరం సరస్వతి నగర్‌కు చెందిన ఆకుల వెంకటేశర్వర్లు, ఒంగోలుకు చెందిన ఓ డెవలపర్స్‌ కంపెనీ యజమాని షేక్‌ అజామాతుల్లా, సేల్స్‌ ఎగ్జిక్యూటివ్‌ గౌతమ్‌రాజు, సేల్స్‌ ఏజెంట్‌ మాదరాజు శివలు ప్రజలను నమ్మించారు. ఇప్పుడే అక్కడ స్థలాలు కొనుగోలు చేస్తే అధిక ఆదాయం పొందవచ్చని మాయమాటలు చెప్పి నెల్లూరుకు చెందిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి నుంచి రూ.5.50 లక్షల తీసుకున్నారు. అయితే వారు ఆ స్థలాన్ని అతనికి రిజిస్ట్రేషన్‌ చేయకుండా ఆ వెంచర్‌ను డెవలప్‌ చేయకుండా మధ్యలోనే నిలిపివేశారు. అప్పటి నుంచి వెంకటేశ్వర్లుకు సదరు సంస్థ నిర్వాహకులు సరైన సమాధానం చెప్పకుండా కట్టిన సొమ్మును తిరిగి చెల్లించకుండా వేధిస్తున్నారు. ఈ క్రమంలో బాధితుడు దర్గామిట్ట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్‌ రోశయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రసన్నుడికి రూ.9.5 లక్షల డిపాజిట్‌

బిట్రగుంట, సెప్టెంబరు 14: బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో వెలసిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి వింజమూరు మండలం రాగిపాడుకు చెందిన తమ్మినేని సుబ్బనాయుడు, నాగేశ్వరరావులు రూ.9.50లక్షలు ఫిక్సడ్‌ డిపాజిట్‌ చేశారు. స్వామివారి ఖాతాలో జమచేసిన ఫిక్సడ్‌ డిపాజిట్‌ పత్రాన్ని శనివారం ఆలయ ఈవో రాధాకృష్ణకు అందజేశారు. స్వామిఅమ్మవార్లన దర్శనాంతరం చేపట్టిన కార్యక్రమంలో మాజీ పాలకమండలి సభ్యులు అరవ తులసీరాం, మాదిరెడ్డి సుబ్బారెడ్డి ఉన్నారు. రాత్రి పరివర్తిన ఏకాదశి సందర్భంగా స్వామి వారికి గరుడసేవ గ్రామోత్సవం బిట్రగుంట ఇరుగ్రామాల్లో వైభవంగా నిర్వహించారు. పాతబిట్రగుంటకు చెందిన కీర్తిశేషులు కొప్పోలు శేషారెడ్డి సతీమణి రమాదేవి, కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. మధ్యాహ్నం నెల్లూరు పట్టణానికి చెందిన దువ్వూరు శరత్‌కుమార్‌, ఉషాకుమారి దంపతులు అన్నసంతర్పణ చేపట్టారు.



ఫిక్సడ్‌ డిపాజిట్‌ పత్రాన్ని ఈవోకు అందచేస్తున్న తమ్మినేని సోదరులు

చికెన్‌ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్‌

	కిలో
బాయిలర్‌ లైవ్‌	131
లేయర్‌ లైవ్‌	110
స్కిన్‌ చికెన్‌	236
స్కిన్‌లెస్‌	260
లేయర్‌	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6865
వెండి కిలో ధర	రూ. 90,100
వెండి ఒక గ్రాము	రూ. 93.10

ఇంత నిర్లక్ష్యమా..!?

- 1.50 లక్షల ఎకరాల్లో వరి పైరు సాగు
- జాడలేని ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- దళారుల దోపిడీతో లబోదిబోమంటున్న రైతులు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 14 : జిల్లాలో వరి కోతలు మొదలై ధాన్యం విక్రయాలు ప్రారంభమైనా ప్రభుత్వం పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. బయట మార్కెట్‌లో ప్రభుత్వ మద్దతు ధర కన్నా తక్కువ ధరకు కొనుగోళ్లు చేస్తుండడంతో రైతులు నష్టపోతున్నారు. ఇతర రాష్ట్రాల వారు కొనుగోలు చేస్తే రైతులు లాభపడే అవకాశం ఉంది. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నాయనే భయం కూడా దళారులకు కలుగుతోంది. కలెక్టర్‌ ఇటీవల రైసు మిల్లర్లతో సమావేశం నిర్వహించి ఇతర ప్రాంతాల నుంచి ధాన్యం కొనుగోళ్లకు వచ్చే వారిని అడ్డుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అయినా అడ్డుకునే వారు అడ్డుకుంటూనే ఉన్నారు. ప్రభుత్వం తరపున ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారులు రంగ ప్రవేశం చేసి రైతులు పండించిన ధాన్యానికి తక్కువ ధర పలికేలా చేస్తున్నారు. ఒక వైపు పెరిగిన సేద్యపు ఖర్చులు, మరో వైపు గిట్టుబాటు ధర లభించక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన వరి పంట చేతి కందితే ఒక ఏడాది ధర బాగుంటుంది.. మరో ఏడాది నష్టాలు ఉంటున్నాయి. ఈ కష్టనష్టాల కోర్చి రైతులు పొలాన్నే నమ్ముకొని పనిచేస్తున్నారు. గత వ్యవసాయ సీజన్‌లో ధాన్యానికి పుట్టి ధర సుమారు రూ.23 నుంచి 25 వేల వరకు పలకడంతో మంచి గిట్టుబాటు ధర లభించింది. లాభాలు బాగా రావటంతో కౌలు ధర కూడా పెరిగింది. వరికోత యంత్రాల రాకతో కోసిన ధాన్యాన్ని కోసినట్లు అమ్ముకోవాల్సిన పరిస్థితి నేడు ఏర్పడింది. గతంలో ధాన్యాన్ని కళ్లాల్లో కుప్పలు వేసి ధర పెరిగినప్పుడు అమ్ముకొనే పరిస్థితి ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు. దీనిని అసరా చేసుకుని దళారులు రైతులను దోపిడీ చేస్తున్నారు.

1.50 లక్షల ఎకరాల్లో...

ధాన్యానికి గత ఏడాది దిగుబడితో పాటు మంచి ధర లభించటంతో ఈ ఏడాది లేట్‌ ఖరీఫ్‌ పంటను రైతులు ఉత్సాహంగా సుమారు 1.50 లక్షల ఎకరాల్లో పంట సాగు చేశారు. కేఎన్‌ఎం 1638, ఆర్‌ఎన్‌ఆర్‌ 15048, కేఎన్‌ఎం సన్నరకాలు ఎక్కువగా వేశారు. దీంతో పాటు ఎన్‌ఎల్‌ఆర్‌ 3999 కూడా కొన్ని చోట్ల పండించారు. వరికోతలు మొదలై విక్రయాలు జరుగుతుండటంతో దళారులు, మిల్లర్ల మాయా జాలంతో ధాన్యం ధర గత సీజన్‌ కంటే తగ్గిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటైతే రైతులు పండించిన ధాన్యానికి గిట్టు బాటు ధర లభిస్తుంది. బయట మార్కెట్‌లో దళారులు ధాన్యం ధర తగ్గించకుండా ఉండేందుకు దోహదపడుతుంది. గతంలో సివిల్‌ సప్లయిస్‌ అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పుడు ధాన్యం సేకరణ బాగా జరిగి మిల్లర్లు, దళారుల దోపిడీకి అడ్డుకట్ట పడింది. ఈసారి సివిల్‌ సప్లయిస్‌ అధికారులు కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు పూనుకోలేదు. దీంతో దళారులు, మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ధాన్యం ధర తగ్గించి కొనడానికి చూస్తున్నారే కాని, రైతు బాగోగులను వారు కోరు కోవటం లేదు. గత ప్రభుత్వంలో ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోళ్ల జర గడంతో ఆ కేంద్రాల్లో సిబ్బంది చేతి వాటం ప్రదర్శించటంతో కొందరు రైతులు నష్టపోయారు. సివిల్‌ సప్లయిస్‌ అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేసి దళారులు, మిల్లర్ల ఆటకట్టించి తాము పండించిన ధాన్యానికి సరైన గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

రైతులు నష్టపోకుండా చూడాలి



జిల్లాలో ఖరీఫ్‌ సీజన్‌ వరి కోతలు ప్రారంభమ య్యాయి. విక్రయాలు కూడా జరుగుతున్నాయి. దళారుల వలన బయట మార్కెట్‌లో గతంతో పోలిస్తే ధర తగ్గిపోతోంది. అధికారులు చర్యలు తీసుకుని రైతులు పండించిన ధాన్యానికి సరైన ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

- చిరసాని కోటిరెడ్డి, జిల్లా రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు అంశం అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వాటి ఏర్పాటు విషయం తెలియ చేస్తాం. గతంలో కొనుగోలు కేంద్రాల ద్వారా గ్రేడ్‌-ఏ, సాధారణ రకాలు కొనుగోలు చేశాం. గ్రేడ్‌-ఏ పుట్టి ధర 18,750గా ఉంది. సాధారణ రకం పుట్టి ధర 18,550గా ఉంది.

- లక్ష్మీనారాయణ, డీఎం, పౌరసరఫరాల సంస్థ

నైతికతే నిజమైన స్వేచ్ఛ

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 14 : సమాజంలో నైతిక విలువలు దిగజారిపోతున్నాయని, వాటిని ప్రతి యువత, వ్యక్తుల్లో మేలుకొల్పడమే నిజమైన నైతికత, స్వేచ్ఛ అని జమాతే ఇస్లామీ హింద్‌ రాష్ట్ర మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి ఫాతిమాకౌసర్‌ తెలిపారు. శనివారం జెండావీధిలోని పీఎస్‌ఎం హైస్కూల్‌లో నైతికతే నిజమైన స్వేచ్ఛ అనే అంశంపై ముస్లిం మహిళల సదస్సు జరిగింది. జమాతే ఇస్లామీ హింద్‌ దేశ వ్యాప్తంగా ఈనెల 30వ తేదీ వరకు నైతిక విలువలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నగరంలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ యువత స్వేచ్ఛ పేరుతో నైతిక విలువలు కోల్పోతుండడంతో యువత, సమాజం, భవిష్యత్తు ప్రమాదంలో పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి జాహెదా, పట్టణ విభాగం కార్యదర్శి ఆయేషా కౌసర్‌, మలికా బేగం, ఆసియా, వహిదాబేగం, గౌహర్‌జాన్‌, అబిదబేగం, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం

నెల్లూరు(క్రైం): నగరంలోని జీజీహెచ్‌ ప్రాంగణంలో గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటనపై దర్గామిట్ట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. ప్రభుత్వ వైద్యశాలలోని చిన్నపిల్లల ప్రసూతి విభాగం వద్ద రోగులు విశ్రాంతి తీసుకునే రేకుల షెడ్డులో ఈ నెల 11వ తేది రాత్రి గుర్తుతెలియని 60 ఏళ్ల వృద్ధుడు అపస్మారక స్థితిలో పడి ఉండటంతో సెక్యూరిటీ సిబ్బంది ఆ వృద్ధుడిని వైద్యశాల వద్దకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందాడని నిర్ధారించారు. వైద్యశాల సిబ్బంది ఫిర్యాదు మేరకు దర్గామిట్ట పోలీసులు వృద్ధుడి ఆచూకీ కోసం విచారిం చినా ఫలితం లేకపోవడంతో శనివారం కేసు నమోదు చేసి దార్యాప్తు చేపట్టారు. వృద్ధుడి వివరాలు తెలిసిన వారు 9440700018కు సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్‌ రోశయ్య తెలిపారు.

ఉపాధ్యాయులకు ఆటవిడుపు



పరుగు పందెంలో ఉపాధ్యాయినులు

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 14 : నిత్యం విధుల్లో సతమతమయ్యే ఉపాధ్యాయులకు కాస్తంత ఆటవిడుపు కలిగేలా వారిని క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించామని యూటీఎఫ్‌ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌.నవకోటేశ్వరరావు తెలిపారు. యూటీఎఫ్‌ స్వర్ణోత్సవాల సందర్భంగా నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శనివారం ఉపాధ్యాయులకు జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలతో పాటు ఉపాధ్యాయుల సంక్షేమంపై పోరాటాలు చేసిన యూటీఎఫ్‌ క్రీడలను కూడా ప్రోత్సహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తుందన్నారు. దీనిలో భాగంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారన్నారు. అనంతరం క్రికెట్‌, వాలీబాల్‌, షటిల్‌ బ్యాడ్మింటన్‌, పరుగుపందెం, జావెలిన్‌ త్రో క్రీడల్లో పురుషులు, మహిళా ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విజేతల వివరాలు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి, మాజీ కార్యదర్శి కె.పరంధామయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీవీ.శేషులు, జీవీ.చలపతిశర్మ, పోటీల నిర్వహణ కమిటీ అధ్యక్షుడు ఎంసీ.అచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

సాగరం చెరువులో చేపల వేట ప్రారంభం

అనంతసాగరం, సెప్టెంబరు 14: అనంతసాగరం చెరువులో శనివారం నుంచి చేపల వేట ప్రారంభమైంది. కొంతకాలంగా వేట లేక అవస్థలు పడుతున్న జాలర్ల సమస్యను స్థానిక నేతలు మాకిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, చల్లా శివారెడ్డి, కేతా శ్రీనివాసులురెడ్డి, కొమ్మి తిరుపతినాయుడు, తదితరులు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి వేట చేసుకునేలా అధికారుల నుంచి ఆదేశాలు ఇప్పించారు. దీంతో చేపల వేటతో సాగరం చెరువులో సందడి నెలకొంది.



చెరువు వద్ద వాహనంలో లోడ్‌ చేస్తున్న చేపల బాక్సులు

అల్లుడు కాదు కిరాతకుడు

- అత్తింటి ఆస్తిపై కన్నేసి బావమరిది హత్య
- హైదరాబాద్‌లో ఘటన, ముగ్గురి అరెస్టు

రాయదుర్గం, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌ బెట్టింగ్‌కు బానిసై అప్పుల్లో కూరుకుపోయిన ఓ వ్యక్తి.. ఆర్థిక కష్టాల నుంచి గట్టేందుకు అత్తింటి ఆస్తిపై కన్నేశాడు. ఆస్తి తనకు దక్కేందుకు అడ్డుగా ఉన్న బావమరిదిని పక్కా పథకం ప్రకారం కిరాయి హంతకులతో హత్య చేయించి ఆత్మహత్యగా చిత్రీకరించాడు. రూ.10 లక్షల సుపారీ మాట్లాడుకుని హత్య చేయించిన ఆ కిరాతక అల్లుడు.. పోస్టుమార్టం నివేదిక వల్ల దొరికిపోయి కటకటాలపాలయ్యాడు. హైదరాబాద్‌, కొండాపూర్‌ ప్రాంతంలోని ఓ ప్రైవేట్‌ పీజీ హాస్టల్‌లో ఈ నెల 2న జరిగిన ఈ హత్యకు సంబంధించిన వివరాలను మాదాపూర్‌ ఏసీపీ శ్రీకాంత్‌ శనివారం వెల్లడించారు. ఏపీ, నెల్లూరు జిల్లా కావలికి చెందిన మద్దసాని ప్రకాశంకు కుమార్తె అమూల్య, కొడుకు యశ్వంత్‌(25) ఉన్నారు. ప్రకాశం తన కుమార్తెను నెల్లురూ జిల్లా సత్యవోలు అగ్రహారానికి చెందిన శ్రీకాంత్‌కు ఇచ్చి 2017లో పెళ్లి చేశారు. కొండాపూర్‌ రాఘవేంద్ర కాలనీలో పీజీ హాస్టల్‌ నిర్వహించే శ్రీకాంత్‌ ఆన్‌లైన్‌ బెట్టింగ్‌కు బానిసై రూ.4కోట్ల మేర అప్పుల్లో కూరుకుపోయాడు. ఆర్థిక సమస్యల నుంచి బయటపడేందుకు శ్రీకాంత్‌ అత్తింటి వారి ఆస్తిపై కన్నేశాడు. ఆస్తి మొత్తం తనకు దక్కాలంటే అడ్డుగా ఉన్న బావమరిది యశ్వంత్‌ను హతమార్చాలని నిర్ణయించుకుని పథకం వేశాడు. ఇందులో భాగంగా బీటెక్‌ పూర్తి చేసి ఖాళీగా ఉన్న యశ్వంత్‌ను హైదరాబాద్‌ పంపించాలని అత్తమామలను కోరాడు. హాస్టల్‌ నిర్వహణలో తనకు తోడుగా ఉంటూ ఉద్యోగ ప్రయత్నం చేసుకుంటాడని వారికి చెప్పాడు. అల్లుడు మాటలు నమ్మిన ప్రకాశం తన కొడుకు యశ్వంత్‌ను కొన్నాళ్ల క్రితం పంపించారు. శ్రీకాంత్‌కు చెందిన హాస్టల్‌లో ఉంటూ యశ్వంత్‌ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తుండేవాడు. అయితే, యశ్వంత్‌ చెడు సావాసాలు చేస్తున్నాడని, గంజాయికి బానిసయ్యాడని శ్రీకాంత్‌ తన అత్తమామలను నమ్మించాడు. హత్యకు నాలుగు రోజుల ముందు కూడా ప్రకాశంకు ఫోన్‌ చేసి యశ్వంత్‌ కోసం చెడుగా చెప్పాడు. మరోపక్క, కర్ణాటకకు చెందిన ఆనంద్‌(35), ఏపీలోని కడప జిల్లాకు చెందిన అంబటి వెంకటేశ్‌(23)తో యశ్వంత్‌ను చంపేందుకు రూ.10లక్షలకు బేరం మాట్లాడుకుని రూ.90 వేలు అడ్వాన్సుగా చెల్లించాడు. ఆనంద్‌ స్థానికంగా వంట పని చేస్తుండగా, వెంకటేశ్‌ ఓ హాస్టల్‌లో సూపర్‌వైజర్‌గా పని చేస్తుంటాడు. ఈ క్రమంలో ఆగస్టు 31న తన హాస్టల్‌ సీసీ కెమెరాలను పని చేయకుండా చేసిన శ్రీకాంత్‌.. సెప్టెంబరు 2వ తేదీ అర్ధరాత్రి తర్వాత వెంకటేశ్‌, ఆనంద్‌ను హాస్టల్‌కి పిలిపించాడు. ముగ్గురూ కలిసి యశ్వంత్‌ ఉన్న గదిలోకి వెళ్లి.. గాఢనిద్రలో ఉన్న యశ్వంత్‌ మెడకు చున్నీ బిగించి ఊపిరాడకుండా చేసి హతమర్చారు. అనంతరం ఫ్యాన్‌కు ఉరివేసి యశ్వంత్‌ ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులను, కుటుంబసభ్యులను శ్రీకాంత్‌ నమ్మించాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఇక, కుటుంబ సంప్రదాయం ప్రకారం యశ్వంత్‌ మృతదేహాన్ని ఖననం చేస్తుండగా శ్రీకాంత్‌ అడ్డుకున్నాడు. హత్య విషయం బయటపడకూడదనే ఉద్దేశంతో దహన సంస్కారాలు చేయాలని పట్టుబట్టాడు. దీంతో శ్రీకాంత్‌ వైఖరిపై కుటుంబ సభ్యులకు అనుమానం మొదలైంది. ఈ క్రమంలో తన కొడుకుది ఆత్మహత్య కాదని హత్య అనే అనుమానం ఉందని యశ్వంత్‌ తండ్రి ప్రకాశం ఈనెల 10న గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకుని విచారించిన పోలీసులు అసలు నిజాన్ని కనిపెట్టి ఆనంద్‌, వెంకటేశ్‌ను కూడా అరెస్టు చేశారు.

పొదుపు గ్రూపుల్లో నిధుల దుర్వినియోగం

- ఒక్కో గ్రూపులో రూ.7 లక్షలు స్వాహా
- జనవాణి కార్యక్రమంలో మహిళల ఫిర్యాదు



జనసేన నాయకులకు వినతిపత్రం అందజేస్తున్న పొదుపు మహిళలు

నెల్లూరు, (స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 14: పొదుపు గ్రూపుల్లో మహిళల నిరక్షరాస్య తను, ఆలోచన రహిత్యాన్ని సొమ్ము చేసుకుంటూ కొందరు పొదుపు లీడర్లు ఒక్కో గ్రూపులో దాదాపు రూ.7 లక్షల వంతున పేదల పొత్తు దుర్వినియోగం చేశారని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్‌ తెలిపారు. నగరంలోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన జనవాణి కార్యక్రమానికి పొదుపు డబ్బులు కాజేసిన దోషులపై చర్యలు తీసుకోకుండా కాలయా పన చేస్తున్నారంటూ తోటపల్లి గూడూరు మండలం నరుకూరు పొదుపు మహిళా సంఘాలకు చెందిన మహిళలు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27 గ్రూపుల్లో ప్రాథమిక విచారణలో దాదాపు రూ.50 లక్షల అక్రమాలు జరిగాయని పోలీసుల విచారణలో తేలినప్పటికీ పోలీసులు కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారన్నారు. గడిచిన ఐదేళ్లలో పొదుపు గ్రూపుల్లో పారదర్శకత లోపించిందని, పొదుపు మహిళలు నెలవారిగా చెల్లించే సొమ్మును బ్యాంకులకు కట్టకుండా లీడర్లు మింగేశారని మహిళలు ఆరోపిస్తున్నా రన్నారు. ఈ అంశంపై సోమవారం తోటపల్లి గూడూరు ఎస్‌ఐను కలుస్తామని, అనంతరం అధికారులను కలిసి బ్యాంకు లెక్కలపై పూర్తి సమాచారం తెలుసు కుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా లీగల్‌ సెల్‌ ఇంచార్జ్‌ చదలవాడ రాజేష్‌, కార్యాలయం ఇన్‌చార్జ్‌ జమీర్‌, రామచంద్రరావు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే దళితులకు రక్షణ

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 14 : టీడీపీ హయాంలోనే దళితులకు రక్షణ, సంక్షేమం జరిగిందని ఆ పార్టీ ఎస్సీ సెల్‌ జిల్లా నేత చాట్ల వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో అనేక మంది దళితులపై దాడులు జరిగాయని, వీటిపై పోలీసు, రెవెన్యూ, దళిత సంఘాల నాయకుల సమక్షంలో విచారణ జరిగితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. కొంతమంది దళిత నేతలు ముత్తుకూరు ఘటనపై టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై అవాస్తవ ప్రచారం చేయడం తగదన్నారు. దళితుల సమస్యలపై ఎప్పుడు సోమిరెడ్డి స్పందిస్తున్నారన్నారు. ముత్తుకూరు ఘటనకు సంబంధించి న్యాయ విచారణ జరిపేందుకు తనవంతు సహకారం కూడా అందిస్తానని ఆయన తెలిపారు.

చేతిపంపునకు మరమ్మతులు

లింగసముద్రం, సెప్టెంబరు 14: స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో మంచినీటి బోరు బాగు చేయడంతో విద్యార్థులకు తాగునీటి సమస్య తీరినట్టైంది. పాడైన బోరు చాలారోజులుగా మరమ్మతులకు నోచుకోక మంచి నీటికి ఇబ్బందులు పడేవారు. వార్డెన్ రామకృష్ణ స్థానిక ఎంపీడీఓ శ్రీనివాసులును దృష్టికి తీసుకొచ్చారు. ఆయన పైపులతో పాటు రిపేరు చేసేందుకు మెకానిక్‌ను పంపారు.

నులిపురుగుల నివారణకు ఆల్బెండోజోల్

లింగసముద్రం, సెప్టెంబరు 14: నులిపురుగుల నివారణకు ఆల్బెండోజోల్ 400ఎంజి మాత్రలు తప్పనిసరిగా వాడాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి శివ తెలిపారు. ఈ నెల 17 నుండి ప్రారంభమయ్యే జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై ఆయన ఆస్పత్రిలో సిబ్బంది, ఆశా వర్కర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల సరఫరా

సీతారామపురం, సెప్టెంబరు 14: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రెండవ సెమిస్టర్ పాఠ్యపుస్తకాలు స్థానిక ఎంఈవో కార్యాలయానికి శనివారం ప్రభుత్వం సరఫరా చేసింది. ఎంఈవో మస్తాన్‌వలి మాట్లాడుతూ జిల్లా కేంద్రం నుండి 5280పాఠ్య పుస్తకాలు మండల కేంద్రానికి వచ్చాయని ఆది, సోమవారాలు సెలవు కారణంగా మంగళవారం పాఠశాలలకు పంపిణీ చేయనున్న ట్లు తెలిపారు.

నేడు నేత్రదాన శిబిరం

కలువాయి, సెప్టెంబరు 14 : స్థానిక బజారువీధిలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం నేత్రదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ కలువాయి బ్రాంచ్ చైర్మన్ పెంచలపుల్లయ్య శనివారం తెలిపారు. శిబిరానికి నెల్లూరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి కంటి వైద్య నిపుణులు శైలజ హాజరవుతారన్నారు. నేత్రదానం చేసే వారి పేర్లు రిజిష్టరు చేసుకుంటారని ఆయన తెలిపారు.

వసతిగృహాల్లో సమస్యలు తిష్ఠ!

- పెచ్చులూడుతున్న శ్లాబు ● గదులకు కిటికీలు, తలుపులు లేవు
- బాతురూంలు, మరుగుదొడ్లకు నీటి కొరత
- లింగసముద్రం ఎస్సీ, బీసీ హాస్టళ్లలో ఇదీ దుస్థితి

లింగసముద్రం, సెప్టెంబరు 14: స్థానిక ఎస్సీ బీసీ బాలుర సంక్షేమ వసతిగృహాలు నరకకూపాలుగా మారాయి. వీటిలో కనీస సౌకర్యాలు కరువవడంతో విద్యార్థులు ఇబ్బందుల మధ్య నెట్టుకొస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ గృహాలను పట్టించుకోక పోవడంతో ఈ దుస్థితి నెలకొందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ రెండు వసతిగృహాల్లోని గదులకు తలుపులు, కిటికీలు లేవు. బీసీ వసతిగృహంలో కొన్నిగదుల తలుపులకు అడ్డుగా పొడవాటి చెక్కలు పెట్టారు. అలాగే చాలా గదుల స్లాబు పైకప్పు పెచ్చులూడి కింద పడుతున్నాయి. కొన్ని గదుల్లో స్లాబు పెచ్చులూడటంతో వాటిని మూసి వేశారు. అలాగే మరుగుదొడ్లు, బాతురూంలకు నీటివసతి లేకపోవడంతో వాటిని వాడడం లేదు. కాలకృత్యాలకు ఆరుబయటకు వెళుతున్నారు. స్నానం కూడా బయటే చేస్తున్నారు. గదుల్లో ఉన్న కరెంటు స్విచ్ బోర్డులు పగిలిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. చాలా ఫ్యాన్లు పనిచేయడం లేదు. కొన్నేళ్ల కిందట నిర్మించిన గదులు కావడంతో శిథిలావస్థకు చేరినట్లు విద్యార్థులు చెబుతున్నారు.



శిథిలావస్థకు చేరిన లింగసముద్రం బీసీ బాలుర హాస్టల్

- **వార్డెన్, సిబ్బంది లేక ఇక్కట్లు**

బీసీ వసతిగృహంలో చాలాకాలం నుంచి కందు కూరు బీసీ బాలుర వసతిగృహం వార్డెన్ తిరుపతిరావు ఇన్‌చార్జిగా వ్యవహ రిస్తున్నారు. ఆయన ఎప్పుడో వస్తుంటారు. ఇక కామాటి, కుక్, వాచ్‌మ్యాన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఓ ప్రైవేటు వ్యక్తితో వంట చేయిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

సీఆర్ఎంటీకి విశిష్ట విద్యాసేవా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న తుమ్మల

కలువాయి, సెప్టెంబరు 14: మండల విద్యాశాఖ క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్ (సీఆర్ఎంటీ) తుమ్మల నాగేశ్వరావుకు కాకినాడకు చెందిన చేయూత స్వచ్ఛంద సేవాసంస్థ వారు విశిష్ట విద్యాసేవా పురస్కారం అందజేశారు. ఆ సంస్థ 7వ వార్షికోత్సవం సందర్భంగా కాకినాడ సూర్య కళామందిర్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో నాగేశ్వరావును ఘనంగా సన్మానించి అధికారులు, ప్రజాప్రతినిధుల చేతులు మీదుగా ఈ పురస్కారం ప్రదానం చేశారు.

సమస్యల పరిష్కారానికి అపస్ కృషి

ఆత్మకూరు, సెప్టెంబరు 14: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్) కృషి చేస్తోందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని సోమశిల సెంటర్‌లో అపస్ ప్రాంతీయ కార్యాలయ భవనం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యాలయం ద్వారా ఉపాధ్యాయులకు ఉచితంగా కంప్యూటర్, ఆన్‌లైన్ సేవలను అందించనున్నట్లు, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘంపై అభిమానంతో ప్రాంతీయ కార్యాలయానికి భవనం కేటాయించిన నలిశెట్టి శ్రీనివాసులును, ఇటీవల ఉత్తమ అవార్డులు అందుకున్న వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజగోపాలాచార్యులు, జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, ఇతర రాష్ట్ర, జిల్లా బాధ్యులు, ఆ సంఘం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వడ్డిపాలెంలో సీతారాముల కల్యాణం

వలేటివారిపాలెం, సెప్టెంబరు 14: వడ్డిపాలెంలో శనివారం జరిగిన సీతారాముల కల్యాణంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవంలో దూరప్రాంతాల నుంచి కుటుంబసభ్యులు, బంధువులు హాజరు కావడంతో పండుగ వాతావరణ నెలకొంది. వాళ్లందరినీ ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించారు. అనంతరం ఎమ్మెల్యే నాగేశ్వరరావుకు గ్రామస్థులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, టీడీపీ నాయకులు పరిటాల భాస్కర్‌రావు, వలేటి మధుసూదన్‌రావు, వలేటి నరసింహం, కాకుమాను మాల్యాద్రి, మన్నం మాధవరావు బత్తుల సుబ్బారావు, చెంచయ్య, బూదాల మాధవరావు పాల్గొన్నారు.

లింగసముద్రం: మొగిలిచెర్ల వినాయక స్వామి పూజల్లో శనివారం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని భక్తులకు అన్నం వడ్డించారు. గ్రామస్తులంతా కలిసి ఈ వేడుకలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు, నార్నె రోశయ్య పాల్గొన్నారు.

సీఐ, ఎస్ఐలకు సన్మానం



సీఐ, ఎస్ఐలను సన్మానిస్తున్న నాయకులు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 14: స్థానిక సర్కిల్‌కార్యాలయంలో ఇటీవల బాధ్యతలు చేపట్టిన సీఐ ఎన్ వెంకటరావు, ఎస్ఐ శ్రీనివాసులను శనివారం టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న, టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, ఉప్పుటూరి పెదవెంకటయ్య, వెంకటేశ్వర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి



కావలిలో నివాళులర్పిస్తున్న నేతలు

కావలి టౌన్, సెప్టెంబరు 14: దేశం గొప్ప నాయకుడ్ని కోల్పోయిందని.. సీతారాం ఏచూరి మృతి సీపీఎంకు.. పీడిత ప్రజానీకానికి తీరని లోటని సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచులయ్య అన్నారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏచూరికి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకయ్య, తిరుపాల్, సుబ్బరా మశర్మ, చేవూరి వెంకటేశ్వర్లు, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: పోలినేనిపాలెంలో ఏచూరికి పలువురు నాయకులు నివాళులర్పించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు అనంతరం ఏచూరి సంస్మరణ సభలో మాదాల రమణయ్య, కుమార్, మాధవమూర్తి పాల్గొన్నారు.

అనంతసాగరం: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఏచూరికి సీపీఎం నాయకులు నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పుల్లయ్య, అన్వర్‌బాష, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

మేకపాటి గౌతమ్‌రెడ్డి పేరు తొలగింపు

సంగం, సెప్టెంబరు 14: సంగం బ్యారేజి పొర్లుకట వద్ద సిమెంట్ అచ్చులతో ఏర్పాటుచేసిన మేకపాటి గౌతమ్ రెడ్డి పేరును బ్యారేజి కన్‌స్ట్రక్షన్ నిర్వాహకులు శనివారం తొలగించారు. బ్యారేజి ముఖద్వారం వద్ద నేమ్ బోర్డులో ఆయన పేరును శుక్రవారం తొలగించిన విషయం విదితమే. అలాగే బ్యారేజి వద్ద ఏర్పాటుచేసిన విగ్రహాన్ని కూడా తొలగిస్తారని వైసీపీ శ్రేణులు గుసగుసలాడుతున్నారు.

నేలబావిని పూడ్చాలని గ్రామస్థుల ఆందోళన

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 14: తిరుమలాపురం పంచాయతీ గుడినరవ గ్రామంలో ప్రమాదక రంగా ఉన్న నేలబావిని పూడ్చాలని గ్రామస్థులు శనివారం ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నివాసాలకు సమీపంలో ఉన్న నేలబావి చుట్టూ చెట్లు ఏపుగా పెరిగి బావి కనిపించకపోవడంతో ఏ సమయంలో ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని భయపడాల్సి వస్తోందని, పలుమార్లు మూగజీవాలు అందులో పడి మృతిచెందగా చిన్నారులు సైతం గాయాలపాలైన సంఘ టనలు అనేకం ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు స్పందించి నేలబావి పూడ్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 14: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం జమాతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం ఆధ్వర్యంలో నైతికతే నిజమైన స్వేచ్ఛ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, సభ్యులు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ పాశ్చాత్య పోకడలకు యువతను దూరం చేసేందుకు జమాతే ఇస్లామీ హింద్ అవగాహన కార్యక్ర మాలు నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నస్రుల్లా, సాదియా, సన, అమీరా, వసీమ, అక్తర్, రుక్సాన తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

వింజమూరు, సెప్టెంబరు 14 : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం హిందీ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా హిందీ ఉపాధ్యాయురాలు సీహెచ్‌వీఎన్ వెంగమాంబ ఆధ్వర్యంలో హిందీ పాటల పోటీలు, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

కావలి రూరల్, సెప్టెంబరు 14: రూరల్ ఎస్ఐ సీహెచ్ తిరుమల రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. దగదర్తి మండల పోలీస్‌స్టేషన్ లో ఏఎస్ఐగా పనిచేసిన తిరుమల రెడ్డి ప్రమోషన్‌పై ఇక్కడికి వచ్చారు.

ద్విచక్ర వాహనంతో ఢీకొన్నాడని ఫిర్యాదు

కావలి రూరల్, సెప్టెంబరు 14: స్థానిక తుఫాన్ నగర్ జంగాలకాలనీ లో ఇంటి ముందు నిల్చున్న తనను షరీఫ్ అను అతను ద్విచక్ర వాహనంతో వెనుక వైపు నుంచి ఢీకొట్టాడని శనివారం బాధితురాలు రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు వైద్యశాలలో చికిత్సపొందుతోంది.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆటో

ఇద్దరు మహిళలకు గాయాలు ● ఎమ్మెల్యే ఇంటూరి పరామర్శ

వలేటివారిపాలెం, సెప్టెంబరు 14: బడేవారిపాలెంలో జాతీయ రహదారిపై శనివారం ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొన్నది. ఈ ప్రమాదంలో పోలినేనిపాలెం గ్రామానికి చెందిన శికాకొల్లు వసంత, ఉషలు గాయపడ్డారు. వసంత, ఉషలు మోటారు బైక్‌పై కందుకూరు నుండి పోలినేనిపాలెం వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కందుకూరు వైపు వెళ్తున్న ఆటోను గమనించిన స్థానికులు వెంబడించి పట్టుకున్నారు. అదే సమయంలో కందుకూరు నుండి వలేటివారిపాలెం వెళ్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు సంఘటనా స్థలంలో ఆగి క్షతగాత్రులను పరామర్శించి 108లో వారిని కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్‌ను వేగంగా వెళ్లకూడదని సూచించారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలభిషేకం



సీఎం చంద్రబాబు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు పాలభిషేకం చేస్తున్న ఎక్సైజ్‌శాఖ అధికారులు

కావలి,సెప్టెంబరు 14: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్)ను ఎక్సైజ్ శాఖలో కలుపుతూ రాష్ట్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్రల చిత్రపటాలకు శనివారం ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పాలభిషేకం చేశారు. కావలి ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో శనివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ లక్ష్మణస్వామి మాట్లాడారు. గతంలో సెబ్‌శాఖను పెట్టి దానిలో ఎక్సైజ్ శాఖను విలీనం చేయటంతో తమశాఖ అధికారులు, సిబ్బందికి తగిన విధులు లేక అసంతృప్తిలో ఉండాల్సి వచ్చిందన్నారు. అయితే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కాగానే సెబ్‌ను ఎక్సైజ్‌లో కలిపి పాతశాఖకు పూర్వ వైభవం తెచ్చారన్నారు. అదే ఉత్సాహంతో పనిచేసి తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ ప్రభుత్వానికి ఆదాయం చేకూర్చేందుకు కృషి చేస్తామన్నారు.

కమనీయం వరసిద్ధి వినాయకుడి కల్యాణం

కావలి టౌన్, సెప్టెంబరు 14: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా కలుగోళశాంభవి ఆలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ చైర్మన్ మలిశెట్టి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో సిద్ధిబుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అలాగే ముసునూరు మర్రిచెట్టి గిరిజన కాలనీలో జరుగుతున్న ఉత్సవాల్లో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి పాల్గొని వినాయకస్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం గిరిజన మహిళలు దిద్దిన ముగ్గులను తిలకించి వారికి స్వీయ నిధులతో నగదు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత హౌసింగ్ ఏఈలు సింగ్, వెంకటయ్య, టీడీపీ నాయకులు హరిబాబు, వెంకట్రావు పాల్గొన్నారు. చివరిగా వాయునందన ప్రెస్‌వీధిలో జరిగిన ఉత్సవాల్లో జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని అమరా వేదగిరి ప్రారంభించారు. శాంతినగర్‌లో కృష్ణబలిజ సంఘం ఆధ్వర్యంలో జిల్లా సంఘం అధ్యక్షుడు పెంచులయ్య పర్యవేక్షణలో జరుతుతున్న ఉత్సవాల్లో భాగంగా భక్తులకు అన్నసంతర్పణ గావించారు.

మహిళా న్యాయవాదిపై దాడి కేసులో నిందితుడి అరెస్ట్

కావలి రూరల్, సెప్టెంబరు 14: స్థానిక బుడంగుంట కాలనీకి చెందిన న్యాయవాది జయలక్ష్మిపై దాడి కేసులో మద్దాయి కలీమ్ అలియాస్ మున్నాను శనివారం రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం రిమాండ్‌కు పంపినట్లు సీఐ రాజేశ్వరరావు తెలిపారు.

బీద లక్ష్మనందకు మోక్షగుండం జాతీయ సేవా అవార్డు



పురస్కారం అందుకుంటున్న బీద లక్ష్మనంద

కావలి టౌన్, సెప్టెంబరు 14: జిల్లాలో గత 12ఏళ్లుగా విశేష సేవలందిస్తున్న రక్తదాన చైతన్యకర్త లైవ్స్ బ్లడ్ వరల్డ్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బీద లక్ష్మనందకు డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జాతీయ సేవా అవార్డు లభించింది. శనివారం బెంగుళూరులో జరిగిన సోమరాజు ఫౌండేషన్ 12 వార్షికోత్సవం సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు శివరాజు విశిష్ట అతిథుల చేతుల మీదుగా పురస్కారం అందజేశారు. పురస్కారగ్రహీత లక్ష్మనంద మాట్లాడారు. దక్షిణ భారతదేశంలో విశిష్ట సేవలందిస్తున్న స్వచ్ఛంద సేవకులకు అందించే మోక్షగుండం విశ్వేశ్వరయ్య జాతీయ సేవా అవార్డు అందుకోవడం సంతోషంగా వుందన్నారు. తాను నిర్వహించే సేవా కార్యక్రమాలకు సహకారమందించిన సంస్థ వాలంటీర్లకు రెడ్‌క్రాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

దేశాభివృద్ధిలో సాంకేతిక విద్య కీలకం: ఎమ్మెల్యే



రిబ్బన్ కట్‌చేసి స్టాళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి టౌన్, సెప్టెంబరు 14: దేశాభివృద్ధిలో సాంకేతిక విద్య కీలకమని ఎమ్మెల్యే డి.కృష్ణారెడ్డి అన్నారు. విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న విశ్వోత్సవ్ 23, 24 రెండ్రోజుల కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇంజనీరింగ్ విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. రాష్ట్రస్థాయిలో సాంకేతిక, సాంస్కృతిక, క్రీడా పోటీలు నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 2,328 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. అనంతరం సాంకేతిక సృజనాత్మకత ఉట్టిపడేలా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శేషయ్య పాల్గొన్నారు.

వరద బాధితులకు ఉపాధ్యాయులు విరాళాల సేకరణ



ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు విరాళం అందజేస్తున్న ఉపాధ్యాయులు

కందుకూరు, సెప్టెంబరు 14: విజయ వాడ వరద బాధితుల సహాయార్థం కందుకూరు డివిజన్ ఉపాధ్యాయులు 2.25లక్షల రూపాయల విరాళం అందజేశారు. ఓ వాట్సాప్ గ్రూప్‌లో ఉన్న ఉపాధ్యాయ మిత్రులు మరికొందరు ప్రభుత్వ ఉద్యోగుల సహకారంతో ఈ మొత్తాన్ని సేకరించి ఆ మొత్తాన్ని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరా వుకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు తల్లపనేని శ్రీను, దామా కొండ పనాయు డు, ఏలూరి చినబ్రహ్మయ్య, ఆరిబోయిన వెంకటే శ్వర్లు, గొర్రెపాటి మధు, వలేటి రవి, ఉన్నం వెం కటరావు, పాలకీర్తి వెంకయ్య, వైద్యశాఖ ఉద్యోగి దామా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

- **టీడీపీ నేతలకు ఎమ్మెల్యే పరామర్శ**

జిల్లా డెయిరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాస రావు, పట్టణ టీడీపీ మాజీఅధ్యక్షుడు కంద్రా మాల్యాద్రిల కుటుంబ సభ్యులను శనివారం రాత్రి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పరామర్శించారు. చల్లా శ్రీనివాసరావు తల్లి లక్ష్మమ్మ, కంద్రా మాల్యాద్రి తండ్రి సోమయ్యలు గురువారం మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయన వెంట టీడీపీ నాయకులు నార్నె రోశయ్య, అల్లం వెంకటేశ్వర్లు, పచ్చవ తిరుపతిస్వామి, గుళ్లా శ్రీనివాసులు, రాయపాటి శ్రీనివాసరావు తదితరులున్నారు.

2,220 కేసుల పరిష్కారం

- కందుకూరు, ఉదయగిరి కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్

కందుకూరు, సెప్టెంబరు 14: స్థానిక సబ్ కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 2,220కేసులను పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎ.శోభారాణి తెలిపారు. ఈమె ఆధ్వర్యంలో జరిగిన లోక్ అదాలత్‌లో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్.నిఖిల్‌రెడ్డి మరో బెంచ్ ఏర్పాటు చేసి ఈ కేసులను పరిష్కరించారు. సివిల్ దావాలు 9, క్రిమినల్ కేసులు 99, ప్రీ లిటిగేషన్ కేసులు 26, ఎస్టీసీ కేసులు 2053, వివాహ సంబంధ కేసులు 4, 28అడ్మిషన్ కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. లోక్ అదాలత్ మెంబర్లుగా బీవీ సుబ్బయ్య, ఎస్కే. షంషుద్దీన్, వీవీసు బ్బారావు, ఎస్కే. యాసిన్‌లు వ్యవహరించారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహె చ్ రమేష్, ఎం. మల్లికార్జున, హరికృష్ణ పాల్గొని కేసులను పరిష్కరించారు.



ఉదయగిరిలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయాధికారి అంజయ్య

- **జాతీయ లోక్ అదాలత్‌ను సందర్శించిన టీఆర్ఆర్ విద్యార్థులు**

శనివారం కోర్టు ప్రాంగణంలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌ను టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతిశాస్త్ర విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సందర్శించారు. కేసులను రాజీమార్గంలో పరిష్కరించేందుకు న్యాయస్థానాలు నిర్వహిస్తున్న ప్ర క్రియపై అవగాహన పొందారు. వీరి వెంట ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్ ఉన్నారు.



కందుకూరు: జాతీయ లోక్ అదాలత్‌ను సందర్శించిన టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

ఉదయగిరి రూరల్: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం న్యాయాధికారి జే అంజయ్య ఆధ్వర్యంలో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీకి ఆమోదయోగ్యమైన సివిల్, క్రిమినల్, మోటార్ వాహన ప్రమాద కేసులు, కుటుంబ వివాదాలు తదితర అపరిష్కృతంగా ఉన్న కేసులను ఇరువురి కక్షిదారుల సమక్షంలో రాజీ చేశారు. కార్యక్రమంలో ఏపీపీ ఎస్ సుకన్య, సీఐ ఎన్ వెంకటరావు, న్యాయవాదులు సందిరెడ్డి రామారావు, సుబానీ, సుధాకర్, అల్తాఫ్, మురళి, మస్తాన్ పాల్గొన్నారు.

జమ్మలపాలెంలో నేడు ఎమ్మెల్యే ప్రజాదర్బార్

జలదంకి: జమ్మలపాలెం సచివాలయంలో ఆదివారం నిర్వహించనున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రత్యేక ప్రజాదర్బార్ నిర్వహించనున్నారు. గ్రామప్రజల నుండి వినతులు స్వీకరించి సత్వర పరిష్కారం అయ్యేవి అక్కడికక్కడే పరిష్కరించనుట్లు శనివవారం ఎమ్మెల్యే కార్యాలయంలో నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమంకు అన్నిశాఖల డివిజన్, మండల అధికారులు పంచాయతీ పరిదిలోని ఉద్యోగులు హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఆర్ఎస్ఆర్‌లో ఇంజనీర్స్ డే !

బిట్రగుంట, సెప్టెంబరు 14: బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల్లో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం ఇంజినీర్స్ డే ఘనంగా జరుపుకున్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ రాజారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉదయగిరి డిప్యూటీ ఇంజనీర్ చంద్రమౌలికి శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్య క్రమంలో ఏవో ఆర్వీ రమణారెడ్డి, ఎన్ఎస్ఎస్ సమన్వ యకర్త కిరణ్‌కుమా ర్, అధ్యాపకులు, తదితరులు ఉన్నారు.



రోగులను కాపాడేది ప్రథమ చికిత్సే !

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 14 : అత్యవసర పరిస్థితుల్లో రోగుల ప్రాణాలను కాపాడేది ప్రథమ చికిత్సేనని ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ కళ్యాణి పేర్కొన్నారు. శనివారం ప్రపంచ ఫస్ట్ ఎయిడ్ డేని పురస్కరించుకుని కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వేల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీవత్స చెస్ట్ క్లినిక్‌లో డాక్టర్ కళ్యాణిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు అనుముల జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, ఉప్పలపాటి రామదాసు, పెంచలయ్య, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

భరోసా ఇవ్వలేని నాయకత్వంలో పనిచేయలేం

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 14 : వైసీపీలో కార్యకర్తలకు భరోసా ఇవ్వలేని నాయకత్వం ఏర్పడిందని, దళిత, బీసీ, మైనార్టీ వర్గాలకు ఆ పార్టీలో గౌరవం, భద్రత లేవని ఆ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాలకీర్తి రవి తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తాను, తన అనుచరులు అందరూ వైసీపీకి రాజీనామా చేసి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నాయకత్వంలో తెలుగుదేశం పార్టీలో చేరుతున్నామని తెలిపారు.

21న యాదే రఫీ

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 14 : బహుముఖ భాషా గాయకుడు మహ్మద్ రఫీ వర్ధంతి సందర్భంగా ఈనెల 21న యాదేరఫీ 31వ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు మైనార్టీ నాయకులు సయ్యద్ సమీ ఓ ప్రకటనలో తెలిపారు. నెల్లూరు పురమందిరంలో జరిగే ఈ కార్యక్రమానికి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. సంగీత కళాకారులు, మహ్మద్‌రఫీ అభిమానులు తరలిరావాలని కోరారు.

స్వాతంత్ర్య సమరయోధులను గుర్తించుకోవాలి

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 14 : స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్తలను ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని పొణకా కనకమ్మ ఆశయ స్థాన సమితి కన్వీనర్ బి.సురేంద్రరెడ్డి కోరారు. శనివారం వర్ధమాన సమాజం భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఇదే హాలులో పొణకా కనకమ్మ, దువ్వూరి రామిరెడ్డిల సంస్మరణ సభ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అతిథిగా పాల్గొంటారని, అందరూ తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏ.జయప్రకాష్, చలంచర్ల భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హిందీభాషా దినోత్సవం



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 14 : నగరంలోని డాక్టర్ కిషోర్స్ రత్నం మెడికల్ ఒలంపియాడ్ పాఠశాలలో శనివారం హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రాచీన, ఆధునిక కవుల చిత్రాలను, పద్యాలను చక్కగా చిత్రీకరించారు. హిందీ భాషా ప్రాముఖ్యతను, భారత రాజ్యాంగం హిందీ భాషను అధికారికంగా ప్రకటించిన విషయాలను తెలియచేస్తూ నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, పాటలు, పద్యాలు ఆకట్టుకున్నాయి. అలాగే హిందీ అధ్యాపకులు జిలానీబేగం, అరులు రామ్‌చరిత్ మానస్‌ను, తులసీదాస్ కవిత్వం, మీరాబాయి భక్తిగీతాల మాధుర్యాలను విద్యార్థులకు తెలియచేశా రు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు, మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్ మణిమాల, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కలేనా!?

- నేతల హామీలు నెరవేరని వైనం
- ఆశగా ఎదురుచూస్తున్న విద్యార్థులు



డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదించిన ప్రభుత్వ జూనియర్ కాలేజీ

పొదలకూరు, సెప్టెంబరు 14 : పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని అప్పుడు,ఇప్పుడు అధికారంలో ఉన్న వైసీపీ నేతలు, టీడీపీ నేతలు పలుమార్లు హామీలు ఇచ్చారు. మూడు దశాబ్దాలుగా నేతల మాటలు హామీలకే పరిమితమయ్యాయి. ఇక్కడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు మెట్ట మండలాల విద్యార్థుల కల. ప్రస్తుతం ఇక్కడ ఒక ప్రభుత్వ, మూడు ప్రైవేటు జూనియర్ కళాశాలలున్నాయి. వీటి నుంచి ఏటా సుమారు వేయిమందిపైగా ఇంటర్ పూర్తి చేస్తున్నారు. వీరు డిగ్రీ చదవాలంటే దూరప్రాంతాలకు వెళ్లాల్సిందే. కొన్ని ఆర్ట్స్, బైసీపీ గ్రూపులు, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో కూడా ఇటీవల ఉండడంలేదు. డిగ్రీ చదువులకు దూరంగా వెళ్లి చదువుకునే ఆర్థిక స్తోమత లేక వారి చదువులు మధ్యలోనే నిలిచిపోతున్నాయి. గతంలో పట్టణంలోని మనుబోలు రోడ్డులో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఐదు ఎకరాల ప్రాంగణంలోనే డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయడానికి ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించడానికి ఎస్వీయూ బృందం వచ్చింది. డిగ్రీ కళాశాల ఏర్పాటుకు జూనియర్ కళాశాల ప్రాంగణం సరిపోతుందని వారు తేల్చారు. అప్పటి నుంచి అదిగో.. ఇదిగో... అంటూ నేతలు కాలయాపన చేస్తూ వచ్చారు. పొదలకూరు చుట్టుపక్కల ఏడు మండలాలకు కేంద్రంగా ఉంది. ఇక్కడ డిగ్రీ కళాశాల ఏర్పాటు ఎంతైనా అవసరం. ఇప్పటికైనా కూటమి నేతలు, అధికారులు డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చొరవ చూపాలని మండల వాసులు కోరుతున్నారు.

ఓవెల్ కళాశాలలో సైన్స్ ఎక్స్‌పో



సైన్స్ ఎక్స్‌పో ప్రారంభిస్తున్న సీఎండీ

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 14 : నగరంలోని ఓవెల్ కళాశాలలో శనివారం సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల సీఎండీ ఆర్.వేణు మాట్లాడుతూ టెక్నాలజీ ఫర్ హ్యూమన్ వెల్ఫేర్ అన్న థీమ్, రెనవబుల్ ఎనర్జీ అనే సబ్ థీమ్‌లతో విద్యార్థులు సాంకేతిక రంగంలో రాణించేలా సైన్స్ ఇగ్నస్‌ను ప్రారంభించామన్నారు. విద్యార్థిని, విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అభిరుచిని పెంచి విజ్ఞాన శాస్త్ర రంగాల్లో విజన్‌ను తయారు చేయడమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నతంగా ఎదగాలని తెలిపారు. అనంతరం ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీకి సంబంధించిన 101 నమూనాల ప్రదర్శనలను ఆయన తిలకించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఈవో ఆర్. ప్రమీల, ఈడీ వీ.బాలు, జీఎం మహదేవన్, ఏజీఎం గంగాధర్, ఎగ్జిక్యూటివ్ ఇన్‌చార్జి విద్య, టీమ్ లీడర్స్ సుధీర్‌బాబు, పెద్దన్న, సిబ్బంది పాల్గొన్నారు.

18న సత్యనారాయణ వ్రతం

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 14 : నగరంలోని మహాత్మాగాంధీనగర్‌లో ఆలయంలో ఈనెల 18న పౌర్ణమి సందర్భంగా ఉదయం 9గంట లకు సామూహిక సత్యనారాయణ వ్రతం జరుగుతుందని ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు ఆలయ ప్రధాన అర్చకులు బి.శ్రీనివాసాచార్యులను సంప్రదించాలని భక్తులను కోరారు.

వినాయకుడి గ్రామోత్సవాలు

మనుబోలు, సెప్టెంబరు 14: మనుబోలులోని పలు గణనాథులకు శుక్రవారం అర్ధరాత్రి గ్రామోత్సవాలు నిర్వహించారు. ఏడు రోజులు పూజలందుకున్న వినాయకులను భారీ గజమాలలుతో ప్రత్యేకంగా అలంకరించి ట్రాలీపై ఊరేగించారు. లడ్డూ, డబ్బుల మాలలకు వేలం నిర్వహించారు. గణపతుల గ్రామోత్సవాలు శనివారం వేకువ వరకు సాగాయి. తరువాత కండలేరు కాలువలో నిమజ్జనం చేశారు.

వెంకటాచలం : మండలంలోని అనికేపల్లిలో టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్, ఆ పార్టీ నేతలు, గ్రామస్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహానికి శుక్రవారం అర్ధరాత్రి ఊరేగింపు చేపట్టారు. శనివారం ఉదయం విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

వైభవంగా గణేశ్ నిమజ్జనం



బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు14: స్థానిక సుహాసినీనగర్‌తోపాటు పలు ప్రాంతాల్లోని గణేశ్ విగ్రహాలను శనివారం రాత్రి స్థానిక టీడీపీ నాయకుల అధ్వర్యంలో నిమజ్జనం చేశారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన డీజే పలువురిని ఉర్రూతలూగించింది. విగ్రహాల ఊరేగింపు అనంతరం సదరన్‌చానల్‌లో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కిషోర్, సుబ్బయ్య, శేషయ్య, హరనాథ్, మహేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

నెల్లూరు(హరనాథపురం): పేదల దాత అయ్యప్పనేని బాలకృష్ణారెడ్డి తల్లి సరోజనమ్మ శనివారం మృతి చెందగా ఆమె నేత్రాలను రెడ్‌క్రాస్‌కు దానం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఏపీ జీఈఎఫ్ జిల్లా చైర్మన్ చేజర్ల సుధాకర్ రావు వారి నివాసానికి చేరుకుని బాలకృష్ణారెడ్డి, ఆయన సోదరులు రఘురాం రెడ్డి, సురేంద్రరెడ్డిలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సేవా టీం నిర్వాహకులు అరవ పరిమళ, ఆర్ ఇందిర, కల్వం శ్రీనివాసు లు, విజయమ్మ, విశ్వనాథం,కోలా రవి, ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను నిరంతరం కొనసాగిస్తాం

- కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి
- 900 మందికి ఉద్యోగ నియామక పత్రాలు



ఉద్యోగ నియామకపు పత్రాలు అందుకున్న యువతతో ఎమ్మెల్యే ప్రశాంతి

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 14 : కోవూరు యువత కోసం నిరంతరం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. నగరంలోని వీపీఆర్ కన్వెన్షన్‌లో కోవూరు నియోజవవర్గ నిరుద్యోగ యువత కోసం శనివారం నిర్వహించిన జాబ్ మేళాలో 900 మంది ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్నారు. 38 బహుళజాతి కంపెనీలు ఈ మేళాలో పాల్గొన్నాయి. ఎమ్మెల్యేతోపాటు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డి యువతకు నియామకపు పత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ మహేంద్ర కంపెనీ 350 మందిని, శ్రీసిటీలోని హీరో మోటార్స్ కంపెనీకి 326 మంది ఎంపికైనట్లు చెప్పారు. మిగిలిన వారికి త్వరలో ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. జాబ్ మేళాలో అవకాశం రాని వారు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని, వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిరంతరం కొనసాగుతుందని చెప్పారు. ప్రభుత్వ సహకారంతో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్వరలో స్కిల్ సెంటర్ ఏర్పాటు చేసి యువతకు శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాబ్ మేళా కన్సల్టెంట్ సీఈఓ అనూష, శ్రీసిటీ సీఈఓ శ్రీనివాసులరెడ్డి, టాటా స్ట్రైక్ ప్రతినిధి గణేష్, టెక్ మహేంద్ర హెచ్‌ఆర్ జగన్, ట్యాగ్ ప్రతినిధి మణికంఠ, టీడీపీ నాయకులు కృష్ణ చైతనయ, దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, అనీష్ రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, జనసేన నాయకులు గుడిహరికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక విధానాలతో రోగ నిర్ధారణ

- ఏపీ పెథాలజీ రాష్ట్ర సదస్సులో డాక్టర్ శ్రీనివాసులరెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైద్య బృందం

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 14 : రోగ నిర్ధారణలో ప్రస్తుతం వస్తున్న ఆధునిక విధాలను అనుసరించాలని నారాయణ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. శనివారం నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో పెథాలజీ రాష్ట్ర సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. రోగ నిర్ధారణలో గత 5 ఏళ్లలో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. నారాయణ పెథాలజీ ప్రొఫెసర్, ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్ డాక్టర్ దుర్గ మాట్లాడుతూ పెథాలజీలో వస్తున్న మార్పులు ప్రయోగ ఫలితాలపై మెడికల్ మాగజైన్‌లో అనేక కథనాల వస్తుంటాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పీజీ విద్యార్థులు పలు రోగ నిర్ధారణలపై ప్రెజెంటేషన్‌లు చేస్తూ కేన్సర్ వ్యాధిలో వస్తున్న ఆధునిక రోగ నిర్ధారణపై వివరించారు. ఈ కార్యక్రమంలో నారాయణ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ శ్యాంసుందర్, కోశాధికారి డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవం

నెల్లూరు(విద్య) : నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి మాట్లా డుతూ పోటీ పరీక్షల్లో నారాయణదే అగ్రస్థానమని, తమ విద్యార్థులు జాతీయస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులతో సత్తా చాటుతున్నారని తెలిపారు. దీనిలో భాగంగానే ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించి సత్కరించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం జాతీయస్థాయిలో జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో 300 మార్కులు సాధించిన ఎస్‌కె.సూరజ్‌కు రూ.5 లక్షలు, ఆలిండియా నీట్ పరీక్షల్లో 715 మార్కులు సాధించిన కె.సందీప్ చౌదరికి రూ.5లక్షల చొప్పున నగదు పురస్కారాలను విద్యార్థుల తల్లిదండ్రులకు అందచేసి వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, కోర్ డీన్ జయకుమార్ రాయుడు, డీజీఎం మధుసూదన్‌రెడ్డి, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

బాణాసంచా నిప్పురవ్వలు పడి పూరిల్లు దగ్ధం

- బాధితులకు సోమిరెడ్డి పరామర్శ



బాధితుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

తోటపల్లి గూడూరు, సెప్టెంబరు 14: మండలంలోని సౌత్ ఆములూరులో శనివారం వేకువ జామున బాణాసంచా నిప్పురవ్వలు పడి టీడీపీకి చెందిన మాజీ ఎంపీటీసీ చావకోటయ్య నాయుడు పూరిల్లు దగ్ధమైంది. ఆక్వా అవసరాల కోసం ఇంట్లో ఉంచిన నగదు, బంగారం ఫ్రిడ్జ్, టీవీ, ఇతర వస్తువుల కలిపి రూ.30లక్షల విలువైన సామగ్రి కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. విషయం తెలుసు కున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి బాధితులను పరామర్శించి, నష్టం వివరాలు తెలుసుకున్నారు. అండగా ఉండి సహాయ సహకారాలు అందిస్తామని వారికి భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, నాయకులు రాధాకృష్ణమనాయుడు, సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, గుడ్లూరు వెంకయ్యానాయుడు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి పాలభిషేకం



సీఎం చంద్రబాబు, మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు పాలభిషేకం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 14: ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖలోకి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ)ని విలీనం చేయడంపై ఆశాఖ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం బుచ్చిలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయం వద్ద అధికారులు, సిబ్బంది సీఎం చంద్రబాబు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు పాలభిషేకం, పూలాభిషేకం చేశారు. ఇక నుంచి సారా తయారీ, రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచుతామని అధికారులు చెప్పారు. ఈకార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ ఎం.యశోధరాదేవి, పీ రవి అంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మనుబోలు, సెప్టెంబరు 14: స్థానిక ఉన్నత పాఠశాలలో శనివారం 1987-88 నాటి పదవతర గతి విద్యార్థులు కలుసుకున్నారు. అప్పట్లో చదువు చెప్పిన గురువు లను, ప్రధానోపాధ్యాయుడు గోపాలన్‌ను పాఠశాలకు తీసుకువచ్చారు. ఉద్యోగాలు, వ్యాపారాల రీత్యా విదేశాల్లో స్థిరపడిన పూర్వవిద్యార్థులంతా తమ గురువులను ఘనంగా సన్మానించారు. పాఠశాలకు రూ. 25వేలు విలువచేసే ప్రింటర్, స్కానర్‌లను ప్రస్తుత హెచ్‌ఎం. డేవిడ్‌కు అందజేశారు. అనంతరం గురువులతో పూర్వవిద్యార్థులు తమ మధురజ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

మామిడిపూడిలో గడ్డివామి దగ్ధం

ముత్తుకూరు, సెప్టెంబరు 14: మండలంలోని మామిడిపూడిలో శనివారం గడ్డివామి దగ్ధమైంది. గ్రామస్థుల కథనం మేరకు, మామడి పూడి రైతు గోని వెంకటేశ్వ ర్లుకు చెందిన 20 ఎక రాల గడ్డివామికి ప్రమా దవశాత్తు మంటలు పూర్తిగా కాలిపోయింది. నెల్లూరు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. గడ్డివామి పూర్తిగా దగ్ధమవడంతో రూ.2లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటాం

- మాలల ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న వాదనాల వెంకటరమణ

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 14 : ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటామని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు వాదనాల వెంకటరమణ అన్నారు. శనివారం నగరంలోని అంబేద్కర్ భవన్‌లో మాలమహానాడు ఆధ్వర్యంలో జరిగిన మాలల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎస్సీ వర్గీకరణ జరిగినప్పుడు మాల ఉద్యోగులు పదోన్నతుల విషయంలో, మాల నిరుద్యోగులు ఏబీసీడీ వర్గీకరణతో ఉద్యోగాలు రాకుండా నష్టపోయారన్నారు. గతంతో సుప్రీంకోర్టు ఈ వర్గీకరణను రద్దు చేయడంతో మాలలకు న్యాయం జరిగిందన్నారు. మళ్లీ సుప్రీం కోర్టు ధర్మాసనం ఎస్సీ వర్గీకరణకు రాష్ట్రాలకు అధికారమిస్తూ తీర్పు నిచ్చిందని, వర్గీకరణ జరిగితే మాలలు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఎస్సీ వర్గీకరణను మాలలు ఏమాత్రం అంగీకరించటం లేదని, రాష్ట్రంలో వర్గీకరణ చేపట్టవద్దన్నారు. వర్గీకరణ అంశం ఆపేసేవరకు తమ పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు కొప్పోలు రఘు, విద్యాశాఖకు చెందిన రంగరాజన్, ఎస్సీ, ఎస్టీ జేఏసీ గౌరవ చైర్మన్ జ్యోతి సోమశేఖరప్రసాద్, మదన్ మిశ్రా, బొడ్డు ప్రసాద్, డాక్టర్ బాలకేశవులు, ఏసునాయుడు, ఈదూరు నిర్మల, ఉష, మోహన్‌రావు, జగదీష్ పాల్గొన్నారు.

లింగ నిర్ధారిత వీర్యంతో పాడి అభివృద్ధి



పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఉపసంచాలకులు నాగమణి

ముత్తుకూరు, సెప్టెంబరు 14 : లింగ నిర్ధారిత వీర్యంతో పాడి అభివృద్ధి సాధ్యమని పశు సంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ నాగమణి తెలిపారు. మండలంలోని నేలటూరులో శనివారం హీఫర్ ఇంటర్నేషనల్, ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ సహకారంతో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేవలం పడ్డదూడలకు మాత్రమే జన్మనిచ్చేలా చేయడం లింగ నిర్ధారిత వీర్యంతో సాధ్యమన్నారు. ఈ విధానం ద్వారా పాడి రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ శిబిరంలో పశువులకు పరీక్షలు నిర్వహించి, మినరల్ మిక్చర్, కాల్షియం, లివర్ టానిక్, నట్టల మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ నిర్మల, పశువైద్యులు గోవర్ధన్, రాజ్యలక్ష్మి, సరితా, శివశంకర్‌రెడ్డి, ఎనర్జీ ఇండియా లిమిటెడ్ అధికారులు ఆశిష్, రూపేష్, హైఫర్ ఇంటర్నేషనల్ డాక్టర్ గణేష్, తదితరులు పాల్గొన్నారు

'గండికోట'కు సర్వేపల్లి పురస్కారం



గండికోటకు సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ఎక్సలెన్సీ పురస్కారం అందజేస్తున్న అతిథులు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు14: బుచ్చి నగర పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం ప్రాథ మికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ఎక్సలెన్సీ పురస్కారం అందుకున్నారు. శనివారం తిరుపతిలో యువతేజం ట్రస్టు, కలాం విజన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వీవీ.గిరి మనుమడు జీ సుబ్రమ ణ్యంశర్మ, కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి కే రత్తయ్య చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా గండికోటకు బుచ్చి ఎంఈవోలు దిలీప్‌కుమార్, పీవీ.రత్నం, తోటి ఉపాధ్యాయులు, సాహితీవేత్తలు శుభాకాంక్షలు తెలిపారు.

పుస్తకావిష్కరణ

కొడవలూరు సెప్టెంబరు 14 : మండలంలోని నార్తురాజు పాళెంలో ఉన్న శ్రీవెంకటేశ్వర ఫార్మసీ కళాశాలలో 'వ్యాధులు - సామా జిక కారణాలు- వాటి సామాజిక సమస్యల నియంత్రణ' అనే పుస్త కాన్ని శనివారం కళాశాల అధినేత పీ గుణశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయితలు, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యామల ప్రసన్నరెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మహ్మద్ షీబా కౌసర్‌లను ఆయన అభినందించారు. అనంతరం మాట్లాడుతూ సమాజంలో కొన్ని నియమాలు పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరు చుకోవడం వంటి విషయాలు ఈ పుస్తకంలో ఉన్నాయన్నారు. ఈ పుస్తకం ఫార్మసీ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



గానలహరి

శోభారాజ్ గాత్ర కచేరి

తిరుమల శ్రీవారి ఆలయం ముందు శనివారం సాయంత్రం సహస్రదీపాలంకార సేవలో పద్మశ్రీ శోభారాజ్ సంకీర్తనాలాపన చేశారు. గాయత్రి మంత్రంతో కార్యక్రమాన్ని ప్రారంభించి ఈరూపమై ఉన్నాడు.. ఇతడే పరబ్రహ్మమూ, కొలిచితే రక్షించే గోవిందుడితడూ.., అను కీర్తనలను మధురంగా ఆలపించి ఆమె భక్తులను ఆకట్టుకున్నారు.

- తిరుమల,ఆంధ్రజ్యోతి





కుమ్మరగుంట పొలాల్లో అట్లాస్ మోత్

బంగారువర్ణంలో వున్న ఈ సీతాకోక చిలుక శనివారం చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం వనమలదిన్నె పంచాయతీ కుమ్మర గుంట పొలాల్లో కనిపించింది. కుమ్మరగుంటకు చెందిన మనోహర్ ఉల్లి సాగు చేసిన పొలంలో కన్పించిన ఈ సీతాకోక చిలుక సైజును చూసిన వారు ఆశ్చర్యపోయారు.అట్లాస్ మోత్‌గా పిలిచే ఈ సీతాకోక చిలుక ఒక్కోవైపు రెండు రెక్కలతో పెద్ద పురుగులా కనిపించింది.రైతులు దాన్ని పట్టుకోబోగా మామూలు పురుగువలే రెక్కలు ముడుచుకోవడం, మళ్లీ కొద్దిసేపటికి సీతాకోక చిలుక వలే రెక్కలు విచ్చుకోవడం జరిగింది.దక్షిణ భారతదేశంలో ఎక్కువగా ఇది కన్పిస్తుంటుందని తిరుపతికి చెందిన పరిశోధకుడు భూపేష్ గుప్తా తెలిపారు.

- పుంగనూరు



పవిత్ర ప్రతిష్ఠ

తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో శనివారం పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారికి సుప్రభాతం, తోమాలసేవ, సహస్రనామార్చన చేశారు. గోవిందరాజ స్వామి, భూదేవి, శ్రీదేవి అమ్మవార్లను యాగశాలకు వేంచేపు చేసి, స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం యాగశాలలో వైదిక కార్యక్రమాల అనంతరం పవిత్ర ప్రతిష్ఠ చేశారు.

- తిరుపతి(కల్చరల్)



యాగశాలలో పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

శాస్త్రోక్తంగా ముక్కంటి పవిత్రోత్సవాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 14: శ్రీకాళహస్తీశ్వరాలయంలో రెండవ రోజు శనివారం పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. నిత్యపూజల్లో జరిగే దోషాలను నివారించి మూలవిరాట్లకు పునరుత్తేజం తెచ్చేలా ఈ పూజలు చేశారు. యాగశాలలో ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో శ్రీ-కాళ-హస్తి ఉత్సవర్లు, భరద్వాజ మహర్షి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి విశేష అభిషేక పూజలు చేపట్టారు. పూర్ణాహుతులు సమర్పించారు. ఆలయాధికారులు పూజా ద్రవ్యాలను సమర్పించారు. ప్రధాన అర్చకులు స్వామినాథన్ గురుకుల్ పాల్గొన్నారు. కాగా, జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.



గాయపడిన లోకేశ్

థియేటర్లో విద్యార్థిపై హత్యాయత్నం..

- ఎంబీయూ కళాశాల విద్యార్థికి కత్తిపోట్లు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 14: థియేటర్‌లో సినిమా చూస్తున్న విద్యార్థిపై హత్యాయత్నం చేసిన ఘటన తిరుపతిలో శనివారం చోటుచేసుకుంది. ఈస్ట్ పోలీసుల వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన లోకేష్ ఎంబీయూ(మోహన్‌బాబు యూనివర్సిటీ)లో రెండవ సంవత్సరం పారా మెడికల్ కోర్సు చేస్తున్నాడు. సూళ్లూరుపేటకు చెందిన కావ్య అక్కడే అదే కోర్సు చేస్తోంది. ఇద్దరూ స్నేహంగా ఉండేవారు. శనివారం సినిమాకు పోవాలని నిర్ణయించుకుని ముందు రోజే కావ్య తిరుపతిలోని పీజీఆర్ థియేటర్‌లో టికెట్లు బుక్ చేసింది. ఈ విషయాన్ని తాను ఐదేళ్లుగా ప్రేమిస్తున్న సూళ్లూరుపేటకు చెందిన కార్తీక్‌కు చెప్పి తనను కూడా సినిమాకు రావాలని కోరింది. కార్తీక్ కూడా టికెట్ బుక్ చేసుకుని సినిమాకు వచ్చాడు. లోకేష్ కావ్యతో స్నేహంగా ఉండడం నచ్చని కార్తీక్ తనతో తెచ్చుకున్న కత్తితో పొట్టలో పొడిచి పారిపోయాడు. కావ్య కూడా అతనితో వెళ్లిపోయింది. థియేటర్ యాజమాన్యం ఈస్ట్ పోలీసులకు సమాచారం అందించింది. డీఎస్పీ వెంకటనారాయణ, సీఐ మహేశ్వర రెడ్డి, ఎస్ఐ నాగేంద్రబాబు అక్కడికి చేరుకుని గాయపడిన లోకేష్ ఎంబీయూ విద్యార్థిగా గుర్తించి, తిరుపతి రుయాకు తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. కావ్య, తాను మంచి స్నేహితులమని, ఆమె కార్తీక్‌తో ప్రేమలో ఉన్న విషయం తెలుసునని లోకేష్ ఆస్పత్రిలో పోలీసులకు చెప్పాడు. కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న కార్తీక్, కావ్యల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లు సీఐ చెప్పారు.

ఐదేళ్ల తర్వాత శ్రీవారి దర్శనం

- పంతం వీడిన టీడీపీ నేత నరసింహయాదవ్



తిరుమల, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): టీడీపీ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు, తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్ ఐదేళ్ల తర్వాత కుటుంబ సమేతంగా శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వైసీపీ పరిపాలనను నిరసిస్తూ గత ఐదేళ్లుగా (పార్టీ అధినేత చంద్రబాబు దర్శనానికి వచ్చినప్పుడు మినహా) ఆయన శ్రీవారిని దర్శించుకోలేదు. వైసీపీ పాలనలో అన్యాయాలు, అక్రమాలకు నిరసనగా ఆయన దీక్ష పూనారు. ప్రభుత్వం మారిన తర్వాత శనివారం తన 40వ పెళ్లిరోజు సందర్భంగా ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. దీక్షను శనివారంతో విరమించుకున్నట్లు నరసింహయాదవ్ తెలిపారు.

భూ సేకరణలో పరిహారం గోవిందా...

- చెల్లింపులో వైసీపీ వారికే అగ్రతాంబూలం
- టీడీపీ ముద్రతో పలువురికి అన్యాయం
- లబోదిబోమంటున్న పల్లం బాధిత రైతులు



పల్లం వద్ద టీటీడీ ఉద్యోగుల ఇళ్ల స్థలాలకు తీసుకున్న భూములు ఇవి

ఏర్పేడు, సెప్టెంబరు 14: టీటీడీ ఉద్యోగుల ఇళ్ల పట్టాలకు సేకరించిన భూముల వ్యవహారంలో గత వైసీపీ నేతల అడ్డగోలు వ్యవహారం తాజాగా వెలుగు చూసింది. కూటమి ప్రభుత్వం రావడంతో బాధితులు ధైర్యం చేసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తున్నారు. వివరాలు పరిశీలిస్తే.. పారిశ్రామికంగా, విద్యాకేంద్రంగా అభివృద్ధి చెందుతున్న ఏర్పేడు మండలంలో భూముల విలువ పెరిగింది. ఈ క్రమంలో అప్పటి వైసీపీ ప్రభుత్వం తిరుమల తిరుపతి దేవస్థానం ఉద్యోగులకు ఈ ప్రాంతంలో ఇళ్ల స్థలాలను ఇవ్వాలని సంకల్పించింది. అయితే భూ సేకరణలోనే వైసీపీ నాయకులు సొమ్ములు నొక్కేశారు. నాటి అధికారులతో కుమ్మక్కై అసలైన భూ యజమానులను దగా చేశారు. పల్లం పంచాయతీ పరిధిలోని 500 ఎకరాలను రెవెన్యూ అధికారులు సేకరించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరుల నుంచి సేకరించిన 330 ఎకరాలకు గాను మొదట విడతగా ఎకరాకు రూ.20లక్షల వంతున వెంటనే పరిహారం చెల్లించారు. ఇందులో వంద ఎకరాల వరకు రెవెన్యూ అధికారుల అండదండలతో దొంగ రికార్డులు సృష్టించి పరిహారం పొందారని సమాచారం. ఎకరాకు రూ.5లక్షలు అధికారులకు ముట్టజెప్పారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అప్పటి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తమ పార్టీ వారికి అనుకూలంగా చక్రం తిప్పారని తెలిసింది.



కొడుకు టీడీపీలో ఉన్నాడని ఇవ్వలేదు

మా అబ్బాయి టీడీపీలో కార్యకర్తగా ఉన్నాడని వైసీపీ ప్రభుత్వంలో మాకు పరిహారం ఇవ్వలేదు. 2004లో అప్పటి ప్రభుత్వం మాకు ఇచ్చిన భూమిని వైసీపీ ప్రభుత్వం తీసుకుంది. పరిహారం కోసం 8 నెలలుగా అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. ఎవరూ స్పందించలేదు.

- ఆదిలక్ష్మి, పల్లం దళితవాడ

జన్మభూమి కమిటీలో ఉన్నానని..

2019 ముందు టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలో ఉన్నాను. అందువల్ల వైసీపీ నేతలు కక్షకట్టి మా గ్రామంలో నాకు పరిహారం ఇవ్వకుండా చేశారు. ఈ ప్రభుత్వం విచారణ చేపట్టి పరిహారం ఇవ్వాలని కోరుతున్నాను.

- పోలమ్మ, పల్లం గిరిజన కాలనీ.



ఇదెక్కడి న్యాయం: 70ఎకరాలకు మాత్రం పైసా కూడా పరిహారం అందించలేదు. కారణం ఈ భూ నిర్వాసితులంతా టీడీపీ సానుభూతిపరులు కావడమే.ఇలా 22మందికి పరిహారం ఇవ్వకుండా అధికారులు కాలయాపన చేశారు. వీరికి 20 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం కుటుంబానికి 1.50 ఎకరా చొప్పున భూపంపిణీ చేసింది. పట్టాదారు పాసుపుస్తకాలు, డీపట్టా కూడా ఉన్నాయి. వెబ్‌ల్యాండ్‌లో నమోదైనట్లు వన్‌బీ కూడా ఉంది. ఇన్ని ఆధారాలున్నా తమకు పరిహారం చెల్లించేదంటూ ఎస్సీ, ఎస్టీ బాధిత రైతులు వాపోతున్నారు. టీడీపీ సానుభూతిపరులం కావడమే తాము చేసిన పాపమా అని ప్రశ్నిస్తున్నారు.

అక్రమాలకు అధికారుల మధ్యవర్తిత్వం

పల్లం దళితవాడకు చెందిన 30మందికి 45 ఎకరాలను ఆన్‌లైన్‌లో మార్పు చేయించుకుని వైసీపీ నేతలు పరిహారం పొందినట్లు సమాచారం. అసలైన రైతులు గగ్గోలు పెట్టకుండా అప్పటి రెవెన్యూ అధికారులు జాగ్రత్తపడ్డారు. పరిహారంలో కొంతమొత్తం చెల్లించేలా రైతులకు, వైసీపీ నేతలకు మధ్య ఒప్పందం కుదిర్చారు. తీరా పరిహారం పొందాక వైసీపీ నేతలు అసలైన రైతుల నోట మట్టికొట్టారు. ఎలాంటి పరిహారమూ ఇవ్వలేదు. బాధిత రైతులు కష్టాన్ని భరించి మౌనం దాల్చారు. టీడీపీ ప్రభుత్వంలో అయినా పరిహారం అందించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.





బ్రహ్మరథంపై బొజ్జ గణపయ్య

- కిక్కిరిసిన కాణిపాక వీధులు

ఐరాల(కాణిపాకం),సెప్టెంబరు 14 : కాణిపాక ఆలయ బ్రహ్మోత్సవాల్లో శనివారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.కాకర్లవారిపల్లెకు చెందిన ఎతిరాజులు నాయుడు,శివప్రసాద్ జ్ఞాపకార్థం మీనాకుమారి, కాణిపాకానికి చెందిన మాజీ ఏఎం పూర్ణచంద్రారెడ్డి కుటుంబ సభ్యులు, మాజీ ఏఎం చంద్రశేఖర రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు హరిప్రసాదరెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. రథోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయంలో ఏర్పాటు చేసిన పుష్పాలంకరణలు, దేవతామూర్తుల ప్రతిమలు ఆకట్టుకున్నాయి.రథోత్సవ సమయంలో ఆలయ సిబ్బంది ధరించిన సైనికుల వేషధారణలు, కీలు గుర్రాలు కూడా అలరించాయి.ఉదయం మూల విరాట్‌కు అభిషేకం నిర్వహించాక అలంకార మండపంలో సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవర్లకు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామిని బ్రహ్మరథంపై ఆసీనులను కావించారు. ఉదయం 7.30 గంటల నుంచి 8.30 గంటల మధ్య సంప్రదాయబద్ధంగా రథాన్ని భక్తులు, ఉభయదారులు కొంతదూరం లాగి భక్తుల దర్శనార్థం ఉంచారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులు బ్రహ్మరథంపై ఉప్పు, బొరుగులు, మిరియాలు, చిల్లర నాణేలు చల్లి, కొబ్బరికాయలు సమర్పించి, కర్పూర హారతులతో మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో రథాన్ని కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు.

కాణిపాకంలో నేడు

బ్రహ్మోత్సవాల్లో ఆదివారం ఉదయం భిక్షాండి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. తిరుకల్యాణం నిర్వహణకు కాణిపాకం, తిరువణంపల్లెకు చెందిన వణిగ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించనున్నారు. రాత్రి నిర్వహించే అశ్వవాహన సేవకు 44బొమ్మసముద్రం, తిరువణంపల్లె, చింతమాకులపల్లె, కారకాంపల్లెలకు చెందిన గోనగుంట బలిజ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరిస్తారు.

21.8కేజీల గంజాయి స్వాధీనం

- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 14: 21.8కేజీల గంజాయిని పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. తొట్టంబేడు పోలీస్‌స్టేషన్ పరిధిలో కారులో ముగ్గురు వ్యక్తులు గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ప్రత్యేక టాస్క్‌ఫోర్సు బృందం నిఘా పెట్టింది. ముగ్గురు యువకులతో సహా కారును, 21.8కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని తొట్టంబేడు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. దీనివెనుక మూలాలను గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

స్కిట్ కళాశాలకు మంచిరోజులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 14: స్థానిక స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలకు మంచిరోజులు రానున్నాయి. మూడేళ్లుగా మూతబడ్డ కళాశాలను జేఎన్‌టీయూకు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందుకోసం కమిటీని నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2018 అక్టోబరు 26న స్కిట్ కళాశాలను జేఎన్‌టీయూకు అప్పగించేలా అప్పటి ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం స్కిట్‌లో పనిచేస్తున్న సిబ్బందిని తొలగించి, 2021 డిసెంబరు నుంచి తరగతులను నిలిపివేసింది. స్కిట్ కళాశాలకు పూర్వవైభవం తెస్తానని ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆ మేరకు ఆయన చేసిన ప్రయత్నాలు ఫలించాయి. మూడేళ్ల తర్వాత కళాశాలపై కదలిక రావడం పట్ల శ్రీకాళహస్తి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన



జాతర ఏర్పాట్లకు సూచనలిస్తున్న కురుగొండ్ల

వెంకటగిరి, సెప్టెం బరు 14: గ్రామశక్తి పోలేరమ్మ జాతర ఏర్పాట్లను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ శనివారం పరిశీలించారు. అమ్మవారి పుట్టి నిల్లుగా భావించే కురమ్రమి వీధిలోని కుమ్మరింట వద్ద ఏర్పాట్లు, జీని గలవారి వీధిలోని అమ్మవారి అత్తవారిల్లుగా భావించే చాకలింటి వద్ద చేయాల్సిన ఏర్పాట్లపై సూచనలిచ్చారు. బయటి ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులను తమ ఇంటి బంధువులుగా ఆదరించడంతో పాటు, అధికారులకు సహకరించి జాతర విజయ వంతానికి కృషి చేయాలని కోరారు. 25,26 తేదీల్లో జాతర సందర్భంగా ఎక్కడైనా అవాంచనీయ సంఘటనలు జరిగితే 8374509962 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. తెలిపారు. ఎమ్మెల్యే వెంట నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, గొల్లగుంట మురళి, జీరం రాజేశ్వరావు, గల్లా శ్రీనివాసులు నాయుడు, కాపా శ్రీనివాసులు నాయుడు, బార్ మధు నాయుడు, అవ్వారు సత్యనారాయణ, తాండవ చంద్రారెడ్డి, రామచంద్రయ్య, నరసింహులు, హేమంత్ చౌదరి, నానీ, చంటి తదితరులు ఉన్నారు.

మిద్దెపై నుంచి పడి యువకుడి మృతి

తడ, సెప్టెంబరు 14: మద్యం మత్తులో హల్‌చల్ చేసిన యువకుడు మిద్దెపైకెక్కి, అక్కడ నుంచి కింద పడి మృతి చెందిన ఘటన మండలంలోని పులివేంద్ర వద్ద శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. బిహార్ రాష్ట్రానికి చెందిన బాబులాల్ ముర్ము(32) రెండు రోజుల క్రితం మాంబట్టు సెజ్‌లోని వీకేసీ పరిశ్రమలో పనిచేసేందుకు వచ్చాడు. శుక్రవారం విధులు ముగించుకుని పులివేంద్ర వద్ద ఉన్న తన బంధువు ఉంటున్న గదికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో ఫూటుగా మద్యం తాగి బయటకు వెళ్లాడు. సమీపంలోని సుస్తి టౌన్‌షిప్ వద్దకు చేరుకొని హల్‌చల్ చేశాడు. సెక్యూరిటీపై రాళ్లు విసరడం, ఇళ్లలోకి దూరి గొడవ చేయడం ప్రారంభించాడు. స్థానికులు అతనిని పట్టుకు నేందుకు ప్రయత్నం చేయగా, ఓ ఇంటి మిద్దెపైకి వెళ్లి అక్కడ నుంచి రాళ్లు విసురుతూ అక్కడ నుంచి కిందకు దూకేశాడు. ఈక్రమంలో ప్రహరీపై పడ డంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘ టనా స్థలానికి చేరుకుని బాబులాల్ ముర్ము మృతదేహాన్ని స్వాధీనం చేసు కొని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడింగ్ నైపుణ్యాల పెంపు కోసమే క్రాఫ్టర్స్ క్లబ్



కోడ్ క్రాఫ్టర్స్ క్లబ్‌ను ప్రారంభిస్తున్న కళాశాల సిబ్బంది

గూడూరు, సెప్టెంబరు 14: విద్యార్థుల్లో కోడింగ్ నైపుణ్యాలను పెంపొం దించి, ఉద్యోగ అవకాశాలను మెరుగుపరిచేందుకే కోడ్ క్రాఫ్టర్స్ క్లబ్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆదిశంకర కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వేణుమాధవ్ తెలిపారు. శనివారం కళాశాలలో వైజాగ్‌కు చెందిన డెమీ సాఫ్ట్‌వేర్ సొల్యూ షన్స్ సహకారంతో కోడ్‌క్రాఫ్టర్స్ క్లబ్‌ను ప్రారంభించారు. కోడింగ్ విభాగంలో విద్యార్థులకు మెరుగైన పరిజ్ఞానాన్ని పెంపొందించి ఉపాధి కల్పించేందుకు ఈ క్లబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో రాజయ్య, ఇమ్మానియేల్, పద్మావతి, సురేంద్రరెడ్డి, రామయ్య పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

గూడూరు అర్బన్, సెప్టెంబరు 14: విజయవాడ వరద బాధితుల సహాయార్థం శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో గాయత్రి పాఠశాల విద్యార్థులు విరాళాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చిల్లకూరు, సెప్టెంబరు 14: మండలంలోని కోట క్రాస్‌రోడ్డు సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు... మండలంలోని రెట్టపల్లి గ్రామానికి చెందిన మస్తాన్(28) నాయుడుపేట వైపు బైక్‌పై వెళుతుండగా టిప్పరు అకస్మాత్తుగా ఆగడంతో వెనుక నుంచి ఢీకొన్నాడు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

కోట, సెప్టెంబరు 14: మండల పరిధిలోని చంద్రశేఖర పురం సున్నంబట్టి వద్ద శనివారం ట్రాక్టర్‌ను కారు ఢీకొంది. వాకాడు మండలం వైట్‌కుప్పానికి చెందిన ఒక కుటుంబం కారులో గూడూరు నుంచి కోట వైపు వెళ్తూ చంద్రశేఖర పురం సున్నంబట్టి వద్ద ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొంది. దీంతో ట్రాక్టర్ పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయ్యింది. అందులో ప్రయాణి స్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి.

అదుపుతప్పి కారు బోల్తా

కోట, సెప్టెంబరు 14: మండల పరిధిలోని విద్యానగర్ కొత్తపాళెం రోడ్డు సమీపంలో శనివారం ఓ కారు అదుపు తప్పి కాలువలో పడిపోయింది. విద్యానగర్ నుంచి నెల్లూరు పల్లి కొత్తపాళెంకు వేగంగా వెళ్తున్న కారు కొత్తపాళెం రోడ్డు మలుపు వద్ద అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు.

గ్రావెల్ టిప్పర్ల అడ్డగింత

చిల్లకూరు, సెప్టెంబరు 14: సాగరమాల రోడ్డు నిర్మాణ పనులకు గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లను శనివారం మండ లంలోని పారిచెర్లవారిపాళెం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిప్పర్లు అధిక లోడ్డుతో వెళుతుండడంతో రోడ్డు దెబ్బతింటోందన్నారు. అంతేకాకుం డా దుమ్ము, దూళి ఇళ్లలోకి చేరుతోందని, దీంతో రోగాల భారీన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. మేఘా సంస్థ ప్రతినిధి మాట్లాడుతూ వారం రోజుల్లో రోడ్డు నిర్మాణం చేపడుతామని, రోజుకు నాలుగు ట్యాంకర్ల నీటిని రోడ్డుపై చల్లి దుమ్ము లేవకుడా చూస్తామని చెప్పడంతో గ్రామస్తులు లారీలను వదలిపెట్టారు.

నాయుడుపేట రూట్ మళ్లింపు

వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 14: వెంకటగిరి - నాయుడు పేట రైల్వే ట్రాక్ మరమ్మతుల కారణంగా వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు సీనియర్ సెక్షన్ అధికారి స్వామినాధన్ శనివారం తెలిపారు. చిన్న వాహనాలు పెట్లూరు మార్గం లోని అండర్ బ్రిడ్జి ద్వారా, లారీలు, బస్సులు నిడిగల్లు, ఊట్లపల్లి మీదుగా నాయుడుపేట మార్గానికి చేరుకోవచ్చుని చెప్పారు. సోమ, మంగళ, బుధవారం రోజుల్లో ఈ మార్పులు ఉంటాయన్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలిక



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 14: సూళ్లూరుపేటలో అదృశ్యమైన బాలిక అఫ్రిన్ క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు చేరింది. శుక్రవారం ఉదయం 5 గంటలకు ఇంటి నుంచి ట్యూషన్‌కు వెళ్లిన బాలిక అదృశ్యం అయిన విషయం తెలిసిందే. తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించడంతో సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ బ్రహ్మనాయుడు వెంటనే అప్ర మత్తమై పాఠశాల వద్ద సీసీ ఫుటేజ్‌లు సేకరించి దర్యాప్తు చేపట్టారు. నాలుగు బృందాలుగా ఏర్పడి పోలీసులు చెన్నైకి వెళ్లి బాలిక ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇంట్లో మందలించడంతో బాలిక మనస్థాపం చెంది రైల్వే స్టేషన్ వెళ్లి రైలు ఎక్కి చెన్నై సెంట్రల్‌కు చేరింది. అక్కడ నుంచి ఆటో ఎక్కి బీచ్‌కు వెళ్లాలని చెప్పడంతో డ్రైవర్ అనుమానంతో బాలికను విచారించి అక్కడి పోలీసులకు అప్పగించాడు. శుక్రవారం అర్ధరాత్రి చెన్నై పోలీసులు సూళ్లూరుపేట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు వెళ్లి బాలికను శనివారం తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

అన్నదానం

చిల్లకూరు, సెప్టెంబరు 14: మండల కేంద్రమైన చిల్లకూరు దళిత వాడలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్ఠించిన గణేష్ విగ్రహం వద్ద శనివారం అన్నదానం చేశారు. ముందుగా వినాయకస్వామి ప్రత్యేక పూజలు పరిపారు. అలాగే ఉట్టి ఉత్సవం నిర్వహించారు. భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు.

బస్టాండులో సౌకర్యాలేవీ?

- వినియోగంలో లేని మరుగుదొడ్లు
- రాత్రిపూట వెలగని లైట్లు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



నిరుపయోగంగా ఉన్న బస్టాండు - వాడుకలో లేని మరుగుదొడ్లు - బస్టాండు బయట నుంచే వెళుతున్న బస్సులు

బాలాయపల్లి, సెప్టెంబరు 14: మండల కేంద్రమైన బాలాయపల్లిలోని ఆర్టీసీ బస్టాండు సౌకర్యాల లేమితో నిరుపయోగంగా మారింది. బాలాయపల్లి నుంచి వెంకటగిరి, గూడూరు తదితర ప్రాంతాలకు అనేక మంది ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. బస్సుల రాక కోసం ప్రయాణికులు కొంత సేపు బస్టాండులో వేచి ఉండాల్సి ఉంటుంది. అయితే బస్టాండులో తగిన సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మరుగుదొడ్లు లేకపోవడంతో అవస్థలు తప్పడంలేదు. అదేవిధంగా రాత్రి సమయాల్లో బస్టాండు ఆవరణలో విద్యుత్ దీపాలు లేకపోవడంతో చీకట్లో నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. అంతేకాకుండా బయట ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు బస్టాండులోకి రాకుండా నేరుగా ప్రధాన రహదారి గుండా వెళ్లి పోతుండడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. బస్సులు బస్టాండులోకి ఎప్పుడు వస్తాయో ఎప్పుడు రావో తెలియని అయోమయ పరిస్థితి ప్రయాణికులకు ఎదురవుతోంది. ఆర్టీసీ అధికారులు స్పందించి బాలాయపల్లి బస్టాండులో వసతులు కల్పించడంతో పాటు బస్సులు లోనికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సౌకర్యాలు ప్రయాణి కులు కోరుతున్నారు.

లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి షమ్మీపర్వీన్ సుల్తానాబేగం

గూడూరు, సెప్టెంబరు 14: లోక్‌అదాలత్ ద్వారా కేసుల సత్వర పరిష్కారం జరుగుతుందని ఏడవ అదనపు జిల్లా జడ్జీ షమ్మీపర్వీన్ సుల్తానాబేగం తెలిపారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్ట ప్రకారం రాజీ చేసుకునేందుకు వీలున్న కేసులను లోక్‌అదాలత్ ద్వారా పరిష్క రించుకోవచ్చున్నారు. ఇందువల్ల సమయం ఆదా అవడంతో పాటు కక్షిదారులకు సత్వర న్యాయం లభిస్తుందన్నారు. రెండు నెలలకు ఒకసారి లోక్‌అదాలత్ నిర్వహించడం జరుగుతుందన్నారు. శనివారం జరిగిన లోక్‌అదాలత్ ద్వారా 49 సివిల్, 31 క్రిమినల్ కేసులను పరిష్కరించినట్లు సిబ్బంది తెలిపారు. కార్యక్ర మంలో న్యాయమూర్తులు సులోచనారాణి, రాజేష్, శంకరయ్య, న్యాయవాదులు, వివిధశాఖల అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో 1203 కేసుల పరిష్కారం

సూళ్లూరుపేట: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 1,203 కేసులను పరిష్కరించారు. సూళ్లూరుపేట కోర్టు అదనపు న్యాయమూర్తి ఎస్.అనూష ఆధ్వర్యంలో లోక్ అదాలత్ జరిగింది. ఇందులో సివిల్ కేసు 1, బ్యాంకు 25, క్రిమినల్ 30, ఎస్‌టీసీ కేసులు 1123 పరిష్కరించారు. కార్యక్రమంలో రెండో అదనపు న్యాయమూర్తి సుబ్బారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రకృతికుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరాముల యాదవ్, లోక్ అదాలత్ సభ్యులు ధర్మా ప్రసాదరావు, న్యాయవాదులు గణపతి, రమణరావు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

షార్ కాలనీలో చాగంటి ప్రవచనాలు



సూళ్లూరుపేట, సెప్టెంబరు 14: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సూళ్లూరు పేటలోని షార్ ఉద్యోగుల కాలనీ పులికాట్ నగర్‌లో శనివారం చాగంటి ప్రవచనాలు నిర్వహించారు. వ్యక్తి గుణ వైభవం అనే అంశంపై బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వర రావు ప్రవచిస్తూ మంచి గుణం ఉన్న వ్యక్తి భగవంతుడితో సమాన మని, సాయం చేసే గుణం ఉన్న వ్యక్తులను ఎప్పటికి మరవరా దన్నారు. షార్ ఉద్యోగులే కాకుండా బయట ప్రాంతాల నుంచి కూడా ప్రజలు విచ్చేసి చాగంటి ప్రవచనాలను ఆసక్తిగా విన్నారు. ఆదివారం కూడా చాగంటి ప్రవచనాలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

సూళ్లూరుపేట, సెప్టెంబరు 14: ఏపీఆర్‌డీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పేద మహిళకు ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షల చెక్కును ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతుల మీదుగా అందజేశారు. ఓజిలి మండలం మాచవరం గ్రామా నికి చెందిన ఎన్.మునెమ్మ ఇళ్లు గత ఏడాది వరదలకు పూర్తిగా దెబ్బతింది. ఏపీఆర్డీ ఆర్గనైజేషన్ స్పందించి ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు ఆర్థిక సాయం ఎమ్మెల్యే చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్డీ ఆర్గనైజేషన్ కో ఆర్డినేటర్ శిల్పాప్రియాంక, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, నాయకులు ఆకుతోట రమేష్, కుదిరి పెంచలయ్య, పర్వతరెడ్డి చంద్రారెడ్డి, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

పెళ్లకూరు సెప్టెంబరు 14: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. శనివారం మండలంలోని ముమ్మారెడ్డిగుంట సమీపంలోని స్వర్ణముఖినది నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు రెవెన్యూ అధికారులకు సమాచారం రావడంతో ఆర్‌ఐ సంతోషి బాయి, వీఆర్వోలు రమేష్, కల్యాణి ఎస్‌ఐ నాగరాజుతో కలసి రెండు ట్రాక్టర్లు పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసనాక సేవలు మరవలేనివి: విజయశ్రీ

సూళ్లూరుపేట, సెప్టెంబరు 14: మాజీ ఎంపీపీ ఇసనాక హర్షవర్ధనరెడ్డి సేవలు మరవలేనివని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఇసనాక జయంతి సంద ర్భంగా శనివారం ఆయన సతీమణి ఇసనాక వాణి, తనయుడు స్థానిక ప్రభుత్వా స్పత్రిలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చారు. ఈ ప్లాంట్‌కు ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం భూమిపూజ చేశారు. ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. అంతకుముందు ఇసనాక చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టి.సుధాకర్ రెడ్డి, ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, గాడి నారాయణ రెడ్డి, మాధవనాయుడు, విజయభాస్కర్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, పార్థసారధి, విజయకుమార్, రాజ సులోచనమ్మ పాల్గొన్నారు.

ప్రసన్న వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

కోట, సెప్టెంబరు 14: మండల పరిధిలోని చిట్టేడు, నెల్లూరుపల్లి కొత్తపాళెం, గోవిందపల్లి, శ్రీలక్ష్మమ్మకాలనీలలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయాల ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి పలు అభిషేకాలు చేసి విశేష అలంకరణలో ఉంచగా, భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

టీడీపీ నేతల కార్ల ధ్వంసం

గూడూరు, సెప్టెంబరు 14: స్థానిక కర్ణాలవీధి సమీపంలో శనివారం గుర్తుతెలియని వ్యక్తులు టీడీపీ నాయకుల కార్లను ధ్వంసం చేశారు. కర్ణాలవీధి సమీపంలో నివాసముంటున్న టీడీపీ నేతలు హిమసాయి, ప్రణీత్ తమ వాహనాలను ఇళ్ల ముందుకు పార్కింగ్ చేశారు. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఈ రెండు కార్ల అద్దాలను రాళ్లతో కొట్టి ధ్వంసం చేశారు. హిమ సాయి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వినాయకుడి లడ్డూ వేలం

నాయుడుపేట, సెప్టెంబరు 14: వినాయక చవితిని పురస్కరించుకుని రాజగోపాల పురం 3వ వీధిలోని ప్రతిష్ఠించిన వినాయక ప్రతిమ వద్ద శనివారం ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహం వద్ద నైవేద్యంగా పెట్టిన లడ్డూను వేలం వేశారు. దర్శి ప్రకాష్, కుట్రమంగళ మనోజ్‌రెడ్డి రూ.1.55 లక్షలకు దక్కించుకున్నారు. అలాగే నగదు మా లను రూ.90 వేల శరణ్య, సూర్య దక్కించు కున్నారు.

కోట: పట్టణంలోని సారంగంవారివీధిలో వినా యకస్వామి లడ్డూ వేలం పాట శనివారం జరిింది. స్థానికుడు సారంగం శివకుమార్ రూ.51,500లకు దక్కించుకున్నాడు.

సీఎం సహాయనిధికి విరాళాల అందజేత

గూడూరు, సెప్టెంబరు 14: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి శనివారం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు దాతలు విరాళాలు అందజేశారు. పట్టణంలోని మాళవ్యానగర్‌కు చెందిన విశ్రాంత అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ అధికారి రాంప్రసాద్ రూ.25వేలు చెక్కును ఎమ్మెల్యేకు అందజేశారు. బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, ఇశ్రాయిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక గమళ్లపాళెం జెండా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రూ.25వేలు చెక్కు ఎమ్మెల్యేకు అందించారు. ధనుంజయరాజు, చంద్రశేఖర్, కిరణ్, గిరి, కోటి తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: వరద బాధితుల సహాయార్థం రూ.లక్ష విరాళాన్ని అందజే యనున్నట్లు నాయుడుపేట పట్టణ వస్త్ర వ్యాపారుస్థులు తెలిపారు. రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ద్వారా సీఎం సహాయ నిధికి అందజేయనున్నట్లు వ్యాపారులు తెలిపారు.

నాయుడుపేట టౌన్: వరద బాధితుల సహాయార్థం పట్టణంలోని బంగారు వ్యాపారుస్తులు రూ.1.50 లక్షల చెక్కును మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, దర్శి రమేష్, సముద్రాల రమేష్, సురేంద్ర, సోమిశెట్టి శ్రీనివాసులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ఉత్సవం



చిట్టమూరు, సెప్టెంబర్ 14: మల్లాంలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం ఆలయ కమిటీ చైర్మన్ కామిరెడ్డి మునిశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ధ్వజస్తంభ ఉత్సవం వైభ వంగా జరిగింది. శైవాగమ శివాచార్య నాదెండ్ల రామేశ్వర గురుకుల్, ఆలయ ప్రధానార్చకులు మూలంరాజు భాను ప్రకాష్‌శర్మ, బెంగుళూరు కృష్ణయ్యశర్మ ప్రత్యేక మంత్రోచ్చారణలతో వళ్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పూజ అనం తరం దేవతలందరికీ ఆహ్వానం పంపించే ధ్వజారోహణ ఉత్సవం చేపట్టారు. తెల్లటి పొడవైన వస్త్రంలో నేమలివాహనాన్ని వేసి తాడుసాయంతో ధ్వజస్తంభం శిఖరానికి చేర్చి దేవతలందరికీ ఆహ్వానం ఆహ్వానం పంపారు. ఇందులో భాగంగా మయూరీ శ్వరుడు ఆహ్వానం అందించి వచ్చిన తదుపరి కొడిముద్దలను భక్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి సోమిశెట్టి సుబ్బారావు, చెవుల రోశయ్య శెట్టి ఉభయదాతలుగా వ్యవహరించారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు సీల్డ్ టెండర్లు

చిల్లకూరు, సెప్టెంబరు 14: మండలంలోని తూర్పు కనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు సీల్డ్ టెండర్లు నిర్వహించినట్లు ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. శనివారం సీల్డ్ టెండర్ల పెట్టెను తెరిచారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ అక్టోబరు నెలలో జరిగే శరన్నవరాత్రి ఉత్సవాల్లో విద్యుత్ అలంకరణ, ప్రింటింగ్స్, యాగ్నిక్ స్వాములు, ఫ్లెక్సీ ప్రింటింగ్, క్లాత్ పందిళ్లు తదితర పనులకు సీల్డ్ టెండర్లు ఆహ్వానించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా బీజేపీ సభ్యత్వ నమోదు

పెళ్లకూరు, సెప్టెంబరు 14: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల పట్ల అన్ని వర్గాల ప్రజలు ఆకర్షితులై బీజేపీకి మద్దతు తెలుపుతున్నారని సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల సభ్యత్వ నమోదు కార్యక్రమ ఇన్‌చార్జి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి తెలిపారు. శనివారం పెళ్లకూరు మండలంలోని జీలపాటూరు, పాలచ్చూరు, ఆర్లపాడు గ్రామాల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు మురళి, ప్రధాన కార్యదర్శి నరసింహులు పాల్గొన్నారు.

వ్యాయామ అధ్యాపకుడికి అభినందనలు



మల్లికార్జునరెడ్డిని అభినందిస్తున్న కరస్పాండెంట్ రామ్‌కుమార్‌రెడ్డి

కోట, సెప్టెంబరు 14: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో వ్యాయామ అధ్యాపకుడిగా పనిచేస్తున్న మల్లికార్జునరెడ్డికి జేఎన్‌టీయూఏ యూనివర్సిటీ ఈనెల 5వ తేదీన ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయ అవార్డు ప్రధానం చేసింది. శనివారం కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి షీల్డ్‌లు, మెమోంటోలతో మల్లికార్జునరెడ్డిని అభినందించారు.

గుర్తుతెలియని వ్యక్తుల దాడి

తడ, సెప్టెంబరు 14: గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేసి గాయపరి చారంటూ ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శ్రీసిటీ సెజ్‌లోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్న సూరత్‌పాల్ సింగ్ తడలో స్నేహితులతో కలసి నివాసం ఉంటున్నాడు. గురువారం రాత్రి శ్రీకాళహస్తి రోడ్డులో నడిచి వెళ్తుండగా గుర్తుతెలియని ఐదుగురు వ్యక్తులు సూరత్‌పాల్ సింగ్‌పై సిమెంట్ రాయితో దాడిచేసి గాయపరిచారు. వెంటనే శ్రీసిటీ ఆస్పత్రిలో చేరి చికిత్స తీసుకున్నాడు. శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

చిల్లకూరు, సెప్టెంబరు 14: ఓ యువతి కనబడడంలేదని శనివారం ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.